ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కథా నిలయం
Entered
శ్రీకాకుళం

ఫిబ్రవరి 24, 2008







పరీక్షలంటే భయమేల!

హ్యాపీ బర్త్‌డే

2008 ఫిబ్రవరి-24నుంచి
2008 మార్చి-1వరకు

యషిక(షీతల్)
2సం॥, ఫిబ్రవరి-2006
సుజాత-అరుణ్
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

సామిక
6సం॥, ఫిబ్రవరి-28
సుహాసిని-వేణు
డోర్నకల్-వరంగల్

తరుణ్(డంబు)
3సం॥, మార్చి-1
ప్రతిమ-శ్రీనివాస్
మలక్‌పేట్-హైదరాబాద్

డి. ప్రవల్లిక
6సం॥, మార్చి-1
లావణ్య-నర్సింహులు
అంబర్‌పేట్-హైదరాబాద్

వి.వివేక్
10సం॥, ఫిబ్రవరి-24
పద్మ-వేణు
చెరువు బజార్-ఖమ్మం

ఎ.వినయ్‌కుమార్
10సం॥, ఫిబ్రవరి-29
విజయ-శ్రీనివాసరెడ్డి
రేవతిసెంటర్-ఖమ్మం

ఎం.కౌసల్య
7సం॥, ఫిబ్రవరి-27
సౌజన్య-సురేంద్రనాథ్
యడ్లపాడు-గుంటూరు



కథా నిలయం
శ్రీకాకుళం

సమాజ హితం కోరేదే

సాహిత్యం

మన అతిథి

పేరు	:	డాక్టర్ శాంతినారాయణ
ఊరు	:	అనంతపురం
తల్లిదండ్రులు	:	వెంకటమ్మ, కేశవయ్య
చదువు	:	విద్వాన్, ఎం.ఎ., పిహెచ్‌డి.,
పుట్టిన తేదీ	:	1-7-1946, సి.బండమీదపల్లి, శింగనమల తాలుకా
వృత్తి	:	డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా ఉద్యోగ విరమణ
ప్రవృత్తి	:	సాహిత్యం, కథ, కవిత్వం రచన
నచ్చిన వ్యక్తులు	:	గురజాడ అప్పారావు, వేమన, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
రచనలు	:	రక్తపు ముద్ద పిలిచింది (1972), రాస్తా కథల సంపుటి (1976), మాధురి (నవల 1978), పల్లేరు ముళ్లు (కథల సంపుటి 1999), తెన్నేటి మలుపులు (నవల 2001), నమ్ముకున్న రాజ్యం (కథల సంపుటి 2004), 'నాగలకట్ట సుద్దులు' వార్త దినపత్రికలో ఫీచర్ కాలం
అవార్డులు	:	విశాల సాహితీ కథా పురస్కారం (1999), కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ పురస్కారం (2003),అదే సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే మాతృభాషా పురస్కారం.

రాబోయే రచనలు: నాగలకట్ట సుద్దులు ఫీచర్ రెండవ వాల్యూమ్.

లలిత కళల్లో సాహిత్యం ఆలోచనాత్మకత ప్రధానమైంది. సమాజ హితం కోరేది సాహిత్యం. మానవుని నిర్మాణాల్లో సాహిత్యం మహోన్నతమైంది. ప్రాచీన మానవుల ఆలోచనలు, తాత్విక చింతనలు, హృదయ స్పందనలు, అతడు సృష్టించుకున్న చరిత్ర, నాగరికత అన్నీ సాహిత్యం వల్ల తెలిసివచ్చాయి. ఏ జాతికి ఉన్నతమైన సాహిత్య సంపద ఉంటుందో అదే గొప్ప నాగరికత కలిగిన జాతిగా చెప్పవచ్చు. దేశంలోని వేదాలు, ఉపనిషత్తులు, జాతకకథలు, త్రిపిటకాలు, పురాణాలు మన పూర్వీకుల ఆలోచనలను, తాత్విక చింతనలను తమలో నిక్షిప్తం చేశాయి. మధ్యయుగాల్లో సాహిత్య సృజన అనేక కారణాల వల్ల వక్రమార్గం పట్టింది. అది ఆనాటి పాలకుల జీవన విధానానికి అద్దం పడుతూనే ఉంది. రాజులను ఆశ్రయించి విలాసవంతంగా బతుకుతున్న కవులు వారికి అనుకూలంగా మధ్యయుగాల్లో సాహిత్య రచన సాగించారు. రాచరికాలు పోయి ప్రజాప్రభుత్వాలు వచ్చాక సాహిత్య రచనల్లోనూ మార్పు వచ్చింది. ఇవి ప్రజల సమస్యలకు అద్దం పట్టే విధంగా ఉన్నాయి. స్వాతంత్ర్యోదమ కాలంలో సాహిత్యం ప్రజలను ఉత్తేజపరిచే విధంగా సాగింది. తదనంతరం కూడా తెలుగు సాహిత్యం సమాజ హితం కోరే దిశగా సాగుతోంది.

శాంతినారాయణ

ఈ సంచికలో....

టపా	...	2
ఆరోగ్యం	...	3
సమ్‌థింగ్ స్పెషల్	...	5
సీరియల్	...	8
సినిమా కబుర్లు	...	10
రుచి	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...

మంచిపుస్తకం ...6

నాటక స్రష్టల అధ్యయన గ్రంథం

చూద్దామా ... 7

పక్షుల ఆవాసం - భరత్‌పూర్

లాహిరి లాహిరిలో	...	20
విజ్ఞాన వీచిక...	...	22
కొత్త పుస్తకాలు	...	24

కథ ... 18

పాపాయి డైరీ





సందేశం ఇచ్చిన కవర్

విలన్ వాలెంటైన్లు కవర్ స్టోరీ శాస్త్రీయంగా సందేశాత్మకంగా ఉంది. నేటి పరిస్థితులకు అద్దం పట్టింది. మానసిక శాస్త్ర పరిశోధన మిళితమై, ఇంటర్‌నెట్ కేఫ్‌లు, మీడియా ప్రభావం ఇంటి వాతావరణం, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు మొదలగు అనేక అంశాలు వ్యాసంలో చర్చించబడినాయి. యువకులు తమ వ్యామోహం తీర్చుకోవడానికి ప్రేమ ముసుగుతో యువతులను వెంటాడుతున్నారు. 'ప్రపంచీకరణ-మహిళలు' మంచి పుస్తకాన్ని పరిచయం చేశారు. ప్రపంచీకరణకు గురి కాని పార్శ్వమేదీ నేటి సమాజంలో లేదు. ఆర్థికాంశాలతో పాటు అనేక అంశాలు చర్చించబడ్డాయి. అందరూ చదవతగిన పుస్తకం.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

సంచిక అంతా ఆకట్టుకుంది

ఫిబ్రవరి 10న ఆదివారం అనుబంధం ఎంతగానో ఆకర్షణీయంగా వచ్చింది. రెండవ పేజీలోని 'హ్యాపే బర్త్‌డే' శీర్షిక కన్నుల పండుగగా కనిపించింది. అట్లాగే మూడో పేజీలో మన అతిథి గురించి ఎన్నో విషయాలు పొందుపరచటం మా భాగ్యంగా తలపోస్తాము. 'రేవతి' కథ బాగుంది. డా॥ జెపి వైద్య గారి వ్యాసం బాగుంది. పాత నటీ నటులను మరొక్కసారి తిలకించే భాగ్యం కలిగించినందుకు సంపాదక వర్గానికి మా కృతజ్ఞతలు. అట్ట చివర పిల్ల కథలు ఎంతో విజ్ఞానదాయంగా వుంటున్నాయి. నీతిని అందించే తీరు ఎంతో బాగుంటోంది. 'నవ్వుల్-పువ్వుల్' నవ్వును వర్షింపజేసి మమ్మల్నందరినీ ముంచేస్తోంది. మేమెంతో ఆనందంగా ఉండగలుగుతున్నాం.

పక్కి బాలకృష్ణారావు, విజయనగరం.

లైబ్రరీలో వుంచుకోదగ్గ పుస్తకం

ఫిబ్రవరి 10న దేమె రాజారెడ్డి గారి పరిచయం అదృష్టంగా భావిస్తున్నాం. వారు వైద్య ధర్మాన్ని నిక్కచ్చిగా చెప్పారు. నేటి వైద్యులకు స్ఫూర్తిదాయకం కాగలదు. 'సృజన లోపించిన సైన్సు పరిశోధనలు' వ్యాసం బాగుంది. పరిశోధనలకు సంబం ధించి ఇండియా ఏ మేరకు వెనుక బడింది? మన పరిశోధనలు ఎంత ఆదర్శవంతంగా వుంటున్నాయి? వంటి విషయాలను ఇందులో ఎస్. వెంకట్రావు గారు చక్కగా మున ముందుంచారు. తెలియని విషయాలు తెలుసుకున్నాం. ఇవేగాక అన్ని పేజీలు - ఆణిముత్యాలే ! లైబ్రరీ ఎడిషన్‌గా ఉంచదగ్గది.

బి. సూర్యారావు, విశాఖపట్నం.

అనేక అంశాలను స్పృశించిన 'విలన్ వాలెంటైన్లు'

అట్టమీది కథగా హిప్నోకమలాకర్ అందించిన 'విలన్ వాలెంటన్లు' ప్రస్తుత సమాజ పోకడలకు దర్పణంలా, ఆలోచ నాత్మకంగా వుంది. అనేక విషయాలను స్పృశించింది. 'స్నేహమంటే ఇదేరా'! ఫొటో ఫీచర్ మానవులూ అలా స్నేహంగా ఉండాలన్న స్పృహ కలగజేసింది. 'బాల నేస్తాలు'... లో పేపర్ లాంతరు విశేషాలు బావున్నాయి. ఇలాంటి వాటిని తరచుగా అందించండి. 'ఆరోగ్యం' లో అందించిన, శాశ్వత దంతాలకు సంబంధించిన సమస్యను అనేక మంది ఎదుర్కొంటూనే ఉంటారు. ఇందులో ఇచ్చిన సమాచారం ఉపయుక్తంగా వుంది. 'సమ్‌థింగ్ స్పెషల్'లో గులాబీల గుసగుసలు విని గులాబీ భాషను చదివి, ఎంతగానో మురిసిపోయాం. మన అతిథి దేమెరాజారెడ్డి పేర్కొన్నట్టు... వైద్య రంగానికి చాలినన్ని నిధులు కేటాయిస్తేనే అందరికీ మెరుగైన వైద్య సదుపాయానికి వీలవుతుందన్నది పాలకులు గ్రహించాలి.

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

ప్రేమను చంపొద్దు

'విలన్ వాలెంటైన్లు' ద్వారా ప్రేమికుల రోజు గురించి తెలియజేసినందుకు కమలాకర్ గార్కి కృతజ్ఞతలు. అసలు ప్రేమ లేనిదే జీవితం లేదు. ప్రేమించకపోతే మనిషి బ్రతకడం అనవసరం. కొంత మంది ప్రేమ ఫలించకపోతే వేధిస్తారు. లేదా ఆత్మహత్యలకు

పాల్పడుతుంటారు. ప్రేమ ఒక వరం. పెద్ద వాళ్ళ అంగీకారం తీసుకోండి. అంతే కాని ప్రేమను చంపొద్దు.

ఎ.ఎస్.ఎస్.ఆర్, ఆర్.ఎస్.సి విజయనగరం.

సంతోషంగా వుంది

అంజలీ దేవి అలనాటి జ్ఞాపకాలు తెలియజేసినందుకు కృతజ్ఞతలు. 'అమ్మ అంటే ఇలా ఉండాలి' అని ప్రేక్షకులకు చూపించిన అనుభూతి మరచి పోలేము. అలాగే అంజలీ పిక్చర్స్ వంటి చిత్రాలు ఇంకా ఎన్నో తియ్యాలనీ మేం కోరుకుంటున్నాము. అలాగే ఇటీవల అక్కినేని నాగేశ్వరరావు గారి చేతుల మీదగా అక్కినేని పురస్కారాన్ని అందుకున్న అంజలీ దేవిగార్కి మా శుభాకాంక్షలు. ఇంత మంచి విషయాలు తెలియజేసినందుకు సంతోషంగా వుంది. పెండ్యాల మురళి గార్కి అభినందనలు. ఇంకా మరిన్ని విషయాలు అందించాలని కోరుకుంటూ...

అనుపోజు సత్యనాగరాజు, రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.



ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

ఆరోగ్యం

డాక్టర్ పిఎల్ఎన్ కపర్ది,

కార్డియాలజిస్ట్,
గ్లోబల్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

గుండె నుంచి ఆక్సిజన్‌తో కూడుకున్న రక్తం ధమనుల ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు చేరుతుంది. సిరల ద్వారా కాలుష్యాలను సేకరించిన రక్తం వెనక్కు గుండెకు వస్తుంది. రక్తం ప్రవహించేటప్పుడు ఎంత ఒత్తిడితో ధమనుల గోడను తాకుతుందో అదే రక్తపోటు.

రక్తపోటు వచ్చిందంటే వదలదు

దీన్నే రెండు రకాలుగా రికార్డు చేస్తుంటారు. గుండె కొట్టుకునేటప్పుడు రక్తపోటుని 'సిస్టోలిక్ ప్రెజర్' అంటారు. రెండు సార్లు కొట్టుకోవడానికి మధ్య గుండె రిలాక్స్ అయినప్పుడు ఉండే రక్తపోటును 'దయాస్టోలిక్ ప్రెజర్' అంటారు. మామూలుగా పైన సిస్టోలిక్ నెంబర్‌ను వేసి, కింద దయాస్టోలిక్ నంబర్‌ను వేస్తుంటారు. సాధారణంగా ఉండాల్సిన రక్తపోటు 120/80 ఎంఎం హెచ్‌జి (మిల్లీమీటర్స్ ఆఫ్ మెర్క్యురీ). ఇంత కన్నా ఎక్కువగా ఉంటే అధిక రక్తపోటు ఉన్నట్లు. అధిక రక్తపోటు వల్ల గుండె జబ్బులు, మూత్రపిండాల జబ్బులు, పక్షవాతం వంటివి రావొచ్చు. రక్తపోటు రావడానికి ఎటువంటి లక్షణాలుండవు. హెచ్చరికలుండవు. దీనికి వయసు, మహిళలు, పురుషులు అనే తేడా ఉండదు. ఎవరికైనా రక్తపోటు రావచ్చు. అమెరికాలో ప్రతి నలుగురిలో ఒకరికి అధిక రక్తపోటు వస్తోందని ఒక సర్వేలో వెల్లడైంది. ఒకసారి అధిక రక్తపోటు వచ్చిందంటే తగ్గే ప్రసక్తే లేదు. ఇది జీవితాంతం ఉంటుంది. అయితే ఎల్లప్పుడూ మందులు తీసుకుంటూ, జీవన శైలిని మార్చుకోవాలి. దీంతో అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది.

రక్తపోటు పెరుగుతుంది, తగ్గుతుంది. పెరిగిన రక్తపోటు మామూలు స్థాయికి రాకుండా ఉండటమే అధిక రక్తపోటు. దీన్ని వైద్యపరిభాషలో హైపర్‌టెన్షన్ అంటారు. అధిక రక్తపోటు ఉన్నవారి గుండె ఎక్కువగా శ్రమ చేయాల్సి ఉంటుంది. వేగంగా రక్తం ధమనుల గోడలను తాకుతూ ప్రవహిస్తుంది. దీంతో ధమనుల గోడలు మందంగా అవుతాయి. దీంతో లోపల రక్తం ప్రవహించే నాళం సన్నగా అవుతుంది. దీన్ని 'ఎథిరోస్కిసెప్' అంటారు. పర్యవసానంగా గుండె జబ్బులు, పక్షవాతం లాంటివి వచ్చే అవకాశాలు ఎక్కువవుతాయి. అంతేకాదు హార్ట్ ఫెయిల్యూర్, మూత్రపిండాల జబ్బు, అంధత్వం రావచ్చు.

రక్తపోటు స్థాయి 140/90 MM.Hg. గాని, అంతకన్నా ఎక్కువగాని ఉంటే అధిక రక్తపోటు ఉన్నట్లే. 65 సంవత్సరాలు దాటిన వాళ్ళలో మూడోవంతు మందికి తప్పకుండా అధిక రక్త పోటు ఉంటుంది.

ఒకవేళ రక్తపోటు 120/80 MM.Hg. 139/89 MM.Hg. ఉంటే 'ప్రీ హైపర్‌టెన్షన్ స్థితి' అంటారు. అంటే రీడింగ్ పెరుగుతూ అధిక రక్తపోటు కలిగించే రిస్క్‌స్థాయిలో ఉందన్నమాట. ఈ సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే అధిక రక్తపోటులోకి రాకుండా కాపాడుకోవచ్చు. కాబట్టి ప్రీ హైపర్‌టెన్షన్ స్టేజి మనకు గోల్డెన్ పిరియడ్ లాంటిది. ఈ స్థాయిలో కాపాడుకోవడం చాలా మంచిది.

55 సంవత్సరాలకు అధిక రక్తపోటు రానివారికి ముందు ముందు రక్తపోటు పెరిగే అవకాశాలు 90శాతం ఉన్నాయి. అంటే జీవిత కాలంలో ఎప్పుడో అప్పుడు అధిక రక్తపోటు వస్తుంది. కింది సంఖ్య ఎక్కువగా ఉంటే ఇబ్బంది, పైసంఖ్యలో మార్పున్నా పెద్ద ఇబ్బంది కాదు అనుకుంటారు కొంతమంది. కాని రెండూ సంఖ్యలూ పెరగడం మంచిది కాదు. 50 ఏళ్ళు దాటినవాళ్ళకు సిస్టోలిక్ ప్రెజర్ అధిక రక్తపోటు నిర్ధారణకు తోడ్పడుతుంది. సిస్టోలిక్ ప్రెజర్ అంటే పైన ఉండే సంఖ్య. అది 140 MM.Hg. అంతకన్నా ఎక్కువ వుంటే అధిక రక్తపోటు ఉన్నట్లే లెక్క. సిస్టోలిక్ ప్రెజరే ఎక్కువ ఉంది. దయాస్టోలిక్ ప్రెజర్ మామూలుగా ఉంటే ఆ స్థితిని 'ఐసోలేటెడ్ సిస్టోలిక్ హైపర్ టెన్షన్' (ఐ.ఎస్.హెచ్) అంటారు. వయసు ఎక్కువ ఉన్నవాళ్లలో ఇది సాధారణంగా ఎక్కువగా ఉంటుంది. దయాస్టోలిక్ ప్రెజర్ 55 సంవత్సరాలలోపు వారిలో ఎక్కువగా ఉంటుంది.

వయసు తక్కువ ఉన్నవాళ్ళలో రక్తపోటు తీరుతెన్నులు తెలుసుకోవడానికి దయాస్టోలిక్ బ్లడ్ ప్రెజర్ ఎంతో తోడ్పడుతుంది. ఇది ఎక్కువయిన కొద్దీ హార్ట్ ఎటాక్, బ్రెయిన్ ఎటాక్, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదాలు ఎక్కువవుతాయి. వయసు ఎక్కువయ్యేకొద్దీ దయాస్టోలిక్ ప్రెజర్ తగ్గుతుంది. సిస్టోలిక్ ప్రెజర్ పెరుగుతుంది. సిస్టోలిక్ ప్రెజర్ పెరిగినా ఇంతకుముందు చెప్పుకున్న జబ్బులు వచ్చే రిస్క్ ఎక్కువే.

'టైప్ ఎ' పర్సనాలిటీ వ్యక్తుల్లో అధిక రక్తపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వీళ్ళు అనుకున్నవి అనుకున్నట్లు జరగాలని ఒక పద్ధతి ప్రకారం జీవితం గడిపేవారు. అలాగే లావుగా ఉండేవాళ్ళు- కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకునేవాళ్ళకు అధిక రక్తపోటు రావచ్చు.

మనం రక్తపోటుని తరచూ చెక్ చేయించుకుంటూ ఉండాలి. వాటిల్లో మార్పులుంటే వైద్యుడి సలహా మీద సరైన చికిత్స తీసుకుంటూ ఉండాలి. ఆహారంలో సాల్ట్, సోడియం తగ్గించాలి. వ్యాయామం చేస్తుండాలి. ఆల్కహాల్, ధూమపానాలకు దూరంగా ఉండాలి. వైద్యుడు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే కార్డియాలజిస్టును కలిసి సలహా తీసుకోవాలి.

ఏముల నర్సింహులు,
మహబూబ్‌నగర్.



తండాలో 'రియల్' తళుకు..!

పాలరాతి బంగళాలు.. కార్లు.. సెల్‌ఫోన్‌లు.. మోటారు బైక్‌లు... కలర్ టీవీలు... హైమాస్ట్ లైట్లు... ఇదంతా హైదరాబాద్‌లో సంపన్నులు నివసించే కాలనీ అనుకుంటే పొరబాటే!

ఈ హైటెక్ హంగులన్నీ 'రియల్'గా ఓ గిరిజన తండా సొంతం..! అవునా! తండాకు తళుకు బెళుకుల సోకు ఎలా వచ్చింది? ఆ గిరిజనుల జీవన విధానంలో ఎలాంటి మార్పులొచ్చాయి? అంతా ఆసక్తిగా ఉంది కదూ.. అయితే ఇంకేం ..చదవండి మరి..!!

అంతా రియల్ బూమ్ మహిమ. ఇంతకు ముందు మనం చెప్పుకున్న తండానే 'పెద్దమ్మ తండా'. ఇది మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూరు మండల కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో వుంది. ఈ మధ్య ఇది పూర్తిగా పట్టణ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ తండా రంగారెడ్డి జిల్లా చిన్న తూప్ర పంచాయితీ పరిధిలో ఈ రెండు జిల్లాల సరిహద్దులో ఉంది.

పూరి గుడిసెలు... మేకలు... గొర్రెలు... పశువులు... వ్యవసాయం.. ఇప్ప సారా తయారీ...గిరిజన దుస్తులు... వంటి సాంప్రదాయ తండా వాతావరణం... పదేళ్ల వ్యవధిలోనే పూర్తిగా కనుమరుగైంది.

తండాలో పంచాయతీ లెక్కల ప్రకారం 85 కుటుంబాలున్నాయి. సుమారు 600 జనాభా ఉంది. 150 ఎకరాల సాగు భూమి ఉన్నా వ్యవసాయం అంతంత మాత్రమే. వర్షాధార పంటలు పండుతాయి. జొన్న పండించడం ఈ తండా ప్రత్యేకత. దీనిని ఒకప్పుడు 'చొప్ప బండ్ల తండా' అని పిలిచే వారు.

పదేళ్ల క్రితం...

తమ తండాతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోనూ, తండాల్లోనూ పండించిన జొన్న చొప్పను సేకరించేవారు. ఎడ్ల బండ్ల ద్వారా హైదరాబాద్‌లోని పురానా పూల్ ప్రాంతానికి తరలించి అమ్ముకునే వారు. వచ్చిన డబ్బుతో జీవనం గడిపే వారు. ఈ కారణంగానే చొప్ప బండ్ల తండా అనే పేరు వచ్చింది. వ్యవసాయం, సారా తయారీ ప్రధాన వృత్తిగా ఉండేవి. ఇదంతా పదేళ్ల నాటి మాట.

సిరులు కురిపించిన రియల్ బూమ్

2001 ప్రాంతంలో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలయింది. 2004 నాటికి ఊపందుకుంది. ఈ వ్యాపారానికి ముందు తండా పరిధిలోని భూములకు ఎలాంటి విలువా ఉండేది కాదు. భూమి సారాన్ని బట్టి ఎకరాకు పదివేల నుండి 30వేలు పలికేది. వ్యాపారం ప్రారంభంతో భూముల ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఎకరా ధర రెండు లక్షల నుండి ఐదు లక్షలకు పెరిగింది. ప్రస్తుతం ఇక్కడ ఎకరా ధర 25 నుండి 30 లక్షలు పలుకుతోంది. దీంతో పలువురు గిరిజనులు తమకున్న భూముల్లో ఎంతో కొంత భాగాన్ని అమ్మేశారు. తండా పరిధిలో మొత్తం 120 ఎకరాల సాగు భూమి ఉండగా ఇప్పటి వరకు దాదాపు 50 ఎకరాల భూమి అమ్ముడు పోయింది. ప్లాట్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. తమకున్న భూముల్లో సగానికి సగం భూములు అమ్ముకున్న గిరిజనులూ ఉన్నారు.

వి.కిషన్ నాయక్‌కు మొత్తం ఎనిమిదెకరాలు ఉండేది. దీనిలో నాలుగెకరాలు అమ్మేశాడు. రతన్ సింగ్, రూప్ సింగ్ తదితరులూ తమ భూముల్లో సగం అమ్ముకున్నారు. అయితే పూర్తిగా ఎవరూ భూములు అమ్ముకోకపోవడం గిరిజనులకు వ్యవసాయం పట్ల, భూమి పట్ల ఉన్న మమకారాన్ని స్పష్టం చేస్తోంది.

మొత్తంగా రియల్ వ్యాపారం గిరిజన కుటుంబాలకు సిరులు కురిపించింది. లక్షాధికారులను చేసింది.

భూములు అమ్ముకున్నారు...

బంగళాలు కట్టుకున్నారు

పదిహేనేళ్ల కిందట తండాలో పూరి గుడిసెలు మాత్రమే ఉండేవి. ఒక అగ్ని ప్రమాదంతో ఇవన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. అనంతరం ప్రభుత్వ సాయంతో పెంకుటిళ్లను నిర్మించుకున్నారు. రియల్ వ్యాపారం కారణంగా స్థోమత పెరగడంతో 2005 నుండి పెంకుటిళ్లను తొలగించి పక్కా బిల్డింగ్‌లు నిర్మించుకోవడం ప్రారంభించారు. ప్రస్తుతం మరింత ఆధునిక హంగులతో నిర్మించుకుంటున్నారు.

'అన్ని వసతులతో ఇళ్లు కట్టుకుంటున్నాం. పట్నం నుండి వచ్చి ఇంజనీర్లు డిజైన్లు గీసిస్తారు. ఆ ప్రకారం పూజ గది, బెడ్‌రూం, కిచెన్, హాల్, బాత్‌రూం, లెట్రిన్ అన్నీ ఉండేలా కట్టుకుంటున్నాం' అని గిరిజనుడు మోహన్‌లాల్ తెలిపారు. రూప్ సింగ్ అనే వ్యక్తి దాదాపు 40 లక్షల అంచనాతో భవంతిని నిర్మిస్తున్నాడు. పాలరాతిని ఉపయోగిస్తున్నాడు. ఇటీవలి కాలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారంతా పది నుండి పదిహేను లక్షలు ఖర్చు చేస్తున్నారని తండా వాసులు తెలిపారు.

కొత్త మోడల్ కార్లు...

తండాలో పది కుటుంబాలకు కార్లు ఉన్నాయి. రతన్ సింగ్, విఠల్ నాయక్, దేవ్‌సింగ్, రాందాస్, రవి, రూప్‌సింగ్ తదితరులకు కార్లు ఉన్నాయి. క్వాలీస్, టాటా సుమో, ఇండికా, టవేరా వంటి మోడల్ కార్లను కొనుగోలు చేశారు. వీటి విలువ దాదాపు ఏడు నుండి పది లక్షలు ఉంటుంది. ఇక ప్రతి కుటుంబానికీ మోటారు సైకిల్ ఉంది. 85 ఇళ్లలో 30 ఇళ్లకు స్టార్ టీవీ కనెక్షన్ ఉంది. 15 కుటుంబాలకు కలర్ టీవీ ఉంది. సీడీ ప్లేయర్, టేప్ రికార్డర్ కూడా ఉన్నాయి.

సర్కారు బడికి వచ్చేవారే...

తండాలో ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాల మూతపడే దశలో ఉంది. ఆరు నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు మాత్రమే ఇక్కడ చదువుతున్నారు. మిగిలిన వారి పిల్లలంతా కొత్తూరు మండలంలోని ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్‌లో చదువుతున్నారు.

పెద్దమ్మ గుడికి తాళం..

అమృతాలయంలో నిత్య పూజలు

తండా వాసుల ఆచార వ్యవహారాల్లో పూర్తిగా మార్పులు చోటు చేసుకున్నాయి. సాంప్రదాయబద్ధంగా కొలిచే పెద్దమ్మను దాదాపుగా విస్మరించారు. దీంతో ఆ గుడికి తాళం పడింది. రెండేళ్ల కిందట నాలుగు లక్షల వ్యయంతో 'లోక్ నాథ్ అమృతాలయం' పేరిట ఒక గుడిని నిర్మించారు. ఇక్కడ రోజూ సాయంత్రం భగవద్గీత పఠనం చేస్తామని గిరిజనుడు లక్ష్మణ్ నాయక్ తెలిపారు. హైదరాబాద్ నుండి ఒక మత ప్రబోధకుడు వస్తాడని తెలిపారు. మహారాష్ట్రకు చెందిన పాండురంగ అతవాలే అనే వ్యక్తి ప్రేరణతో ఆలయాన్ని నిర్మించామని తెలిపారు. అమృతాలయంలో లంబాడీలే పూజారులుగా ఉన్నారని చెప్పారు. మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి... ప్రతి పున్నమి నుండి అమావాస్య వరకు మూడు జంటల చొప్పున నిత్య పూజలో ఉంటాయని తెలిపారు. పార్వతి, ఈశ్వరుడు, విష్ణువు, వినాయకుడిని పూజిస్తున్నట్లు చెప్పారు.

నాడు జొన్న సంకటి... నేడు సన్నన్నం

పదేళ్ల క్రితం వరకూ జొన్న సంకటి, సజ్జసంకటి, జొన్న రొట్టె, మిరపకారం తినే వారమని, ప్రస్తుతం తండాలో అంతా సన్నన్నం తింటున్నారని వృద్ధుడు తార్యా నాయక్ తెలిపారు. తమ ఆహారంతో పాటు ఆచార వ్యవహారాల్లోనూ మార్పులు వచ్చాయని చెప్పారు. గతంలో పదిహేను రోజుల పాటు పెళ్లి తంతు జరిపేవారమని, ప్రస్తుతం రెండు రోజుల్లో ముగిస్తున్నామని అన్నారు. అప్పట్లో పశువులను కట్న కానుకలుగా ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. లక్ష రూపాయల నుండి మూడు లక్షల వరకు నగదు, తులం బంగారం, 50 తులాల వెండి కట్న కానుకలుగా ఇస్తున్నారని చెప్పారు.

కనుమరుగయిన పశు సంపద

తండాలో ఒకప్పుడు పశు సంపద బాగా ఉండేది. ప్రతి ఇంట్లోనూ ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు ఉండేవి. ఇప్పుడు ఇంటికి ఒక ఆవు, రెండెద్దులు మాత్రమే ఉన్నాయని తండా వాసులు తెలిపారు. జొన్న పంట ఎక్కువగా పండించే వారు. ప్రస్తుతం భూముల అమ్మకం వల్ల వ్యవసాయ పనులూ తగ్గాయి. కూలీలు తగ్గి భవన నిర్మాణ కార్మికులు పెరిగారని తండాకు చెందిన మోహన్ తెలిపారు. ఆరుగురికి బోరు బావులు న్నాయని, వీరు మాత్రమే వరి, కూరగాయలు, మిరప పండిస్తున్నారని తెలిపారు.

ఈ ఆరుగురూ నిరుపేదలు...

జర్పులావత్ లక్ష్మణ్, భాన్యా నాయక్, కిషన్ నాయక్, వశ్యా, పాండు నాయక్, గోపాల్ నాయక్‌కు ఎలాంటి భూమీ లేదు. గతంలో వీరి పెద్దలు తమకున్న భూములను అమ్ముకోవడంతో ప్రస్తుతం నిరుపేదలుగా ఉన్నారు. కూలీ నాలీ చేసుకుని జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వ భూ పంపిణీ గురించి వాకబు చేయగా ...'మా నాన్నకు అర ఎకరా ఉండేది. నా చిన్నప్పుడే తిండి కోసం అమ్ముకున్నాడు. ఇప్పుడు భూముల ధరలు బాగా పెరిగాయి. ఈ దేశం స్వర్ణాంధ్ర అయినా, అమెరికాలాగా దెవలప్ చేసినా .. మేము మాత్రం భూమి కొనలేం. సర్కారు కూడా మాకు భూమి కొనివ్వలేదు. పేదోడికి ఎప్పుడూ కష్టమే' అంటూ జర్పులావత్ లక్ష్మణ్ నిట్టూర్చారు.

❋

శైలి

పరభాషా నాటకాలతో పోల్చుకున్నప్పుడు తెలుగు నాటకరంగం వెనుకబడి ఉన్నది. సాంఘిక నాటకమైతే మరీ పరిషత్‌లకే పరిమితమైపోయింది. సమాజంలోకి వెళ్ళవలసినంతగా వెళ్ళకుండా ఎప్పుడో ఆగిపోయింది. అలాంటప్పుడు సమాజంలో కుళ్ళును ఎలా కడగగలదు? మాలిన్యం నుండి సమాజాన్ని రక్షించే బాధ్యతలో నాటకం ఎలా భాగస్వామ్యం కాగలదు? అసలు నాటక స్రష్టలు ఆ దిశలో ఆలోచించగలుగుతున్నారా? కప్పలకు, దుప్పట్లకు, చప్పట్లకు పరిమితమై పోతున్నారా? ఈ నేపథ్యంలో 'కన్యాశుల్కం' నాటక సృష్టికి మహాకవి గురజాడ పడిన శ్రమ వృథాగా మిగిలిపోవాల్సిందేనా?



నాటక స్రష్టల అధ్యయన గ్రంథం

సమకాలీన సంక్షుభిత సమాజంలోకి తోసుకు వస్తున్న అనేకానేక సమస్యలకు నాటకం ద్వారా సహేతుకమైన పరిష్కారం రేఖా మాత్రంగా చెప్పడానికైనా వీలు కాదా? సమాజాన్ని అంతర్ముఖం గావించి ఆత్మావలోకనంతో రుజువర్తనం వైపు ధైర్యంగా ముందడుగు వేయించడం సాధ్యంగాదా?

ఒకవేళ సాధ్యమైతే నాటకకర్తలు ఆ యజ్ఞఫలంకై ఏ విధంగా శ్రమించాలి? ఉత్తమ నాటకానికి ఎలా జన్మనివ్వాలి? యావత్ జాతి ఆ నాటకాన్ని తమదిగా సొంతం చేసుకొని తద్వారా చేతనులై తమ సమాజాన్ని కాపాడుకుంటూ ఎలా ముందుకు నడిపించుకోవాలి?

-ఇలాంటి ప్రశ్నలన్నింటికి చక్కటి సమాధానాలిస్తూ అడుగడుగునా ఉత్తేజ పరుస్తూ ముందుకు నడిపించే పుస్తకం 'కన్యాశుల్కం - 19వ శతాబ్ది - ఆధునిక భారతీయ నాటకాలు'. మహోపాధ్యాయులు డా॥ యు. ఎ. నరసింహమూర్తి గారి పరిశోధక గ్రంథం. నిజమైన నాటకకర్తలకు అద్భుత గ్రంథం. అపురూపమైన గ్రంథం. అధ్యయనం చేయవలసిన అత్యుత్తమ గ్రంథం.

పరిశోధన అంటేనే కఠోరమైన పరిశ్రమ. అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, తమిళం, కన్నడం, హిందీ, మొదలైన భారతీయ భాషల్లో వెలువడిన నాటకాల విశేషాలను తెలుపుతూనే మన కన్యాశుల్కం నాటకానికి ఉన్న విలక్షణతను ప్రయాసకోర్చి తూచి చూపారని పేర్కొంటూ మూర్తిగారిని డా॥ సి.నారాయణ రెడ్డి అభినందించారు.

720 పేజీలతో ఎనిమిది విభాగాలుగా సాగిన ఈ ఉద్గ్రంథం 'మామూలు మాటలతో మనస్సును కొలవలేం' అన్న మహాకవి శ్రీశ్రీ వాక్కులతో ఆహ్వానిస్తుంది.

అసలు సంప్రదాయ నాటకం సామాన్యులకు ఎందుకు చేరువ కాలేకపోయింది? ప్రజల భాష నాటక రచనకు పనికిరాదనేది ప్రబల విశ్వాసం. అలాగే వలసపాలకులు దేశంలోకి రానంతవరకు నాగరికులకు జానపదులకు మధ్య పూడ్చలేని అగాధం ఉంది. ఇలాంటి నేపథ్యంలో పాశ్చాత్య జీవనసరళిని అంగీకరించి, అందుకు అనుగుణంగా తమను తాము మార్చుకునే నైపుణ్యంగల పార్శీలు ఆంగ్లేయుల ప్రభావంతో బొంబాయిలో 1850 ప్రాంతం నుండి ఆధునిక నాటకాలకు (ఇంగ్లీషు నాటకాలతో) బీజం వేశారు. 1885 వరకు బెంగాలీ భాషలోనే ఎక్కువ నాటకాలు వచ్చాయి.

ఆధునిక నాటకాలను మూడు రకాలుగా వర్గీకరించారు. 1. అనుసరణలు, 2. అనువాదాలు, 3. స్వతంత్ర రచనలు, కాల్పనిక వాదం నుండి స్వభావ వాదం ముందుకొచ్చిందని వివరిస్తూ భారతీయ భాషలతో స్వభావవాదాన్ని ఆశ్రయించిన తొలి గొప్ప ఆధునిక నాటకం 'కన్యాశుల్కం' అని తేల్చి చెప్పారు.

భాష గురించి చెబుతూ ఆధునిక భారతీయ నాటకాలకు ఒరవడి పెట్టిన పార్శీ నాటక సంప్రదాయం వ్యాపార దృక్పథం కలది కావడం చేత భాష విషయంలో ప్రజాభిరుచినే అనుసరించిందని వివరించారు.

అయితే ప్రజాభిరుచిలోని కీడును పరిహరించి, మేలు చేసే ఉత్తమాభిరుచిని కల్పించడానికి ప్రయత్నించిన మేధావులలో గురజాడ ముందు పీఠిన ఉన్నాడు.

పాత విశ్వాసాలు సడలి, ఆధునిక రీతుల పట్ల సరైన అవగాహన లేకపోవడం వలన నాటి కాలంలో నాటకాల సృష్టికి సమ్యవగాహనలేని స్థితి ఉంది. దీనిని కన్యాశుల్కంతో గురజాడ ఛేదించాడు. అలాగే గురజాడ నాటకంలో సంగీత ప్రవేశాన్ని వ్యతిరేకించి ప్రపంచ ఆధునిక నాటక పితామహుడు ఇబ్సన్‌కు ప్రతినిధిగా నిలిచాడు.

సారస్వత నాటకం పండిత రంజకమైతే రంగస్థల నాటకం ప్రజా రంజకమైనది.

మొదటి కన్యాశుల్కం నాటకం 5 అంకాలు 62 పేజీలకు పరిమితమైతే రెండవ కన్యాశుల్కం నాటకం 7 అంకాలతో 226 పేజీలకు విస్తరించింది. గురజాడ ప్రపంచ నాటకాన్ని కాసి వడపోశాడు గనుకనే 17 ఏళ్ళ నిరంతర మధనంతో ఆ నాటకాన్ని అద్భుతమైన ప్రదర్శనయోగ్యంతో ప్రపంచ నాటికల సరసన నిలపగలిగాడు. అలా కన్యాశుల్కంను ఆధునిక మహేతిహాసం (ఎపిక్ డ్రామా)గా రూపొందించిన ఖ్యాతి ఒక్క గురజాడకే దక్కుతుందని మూర్తి వక్కాణించారు.

ఆధునిక భారతీయ నాటకము - తొలి అర్థశతాబ్ది గురజాడ సాహిత్యము- కన్యాశుల్కము, కన్యాశుల్కము,-పాశ్చాత్య నాటక ప్రభావం, ఆధునిక బెంగాలీ నాటకం-కన్యాశుల్కం అలాగే అస్సామీ, గుజరాత్, మరాఠీ, హిందీ, కన్నడ ఆధునిక నాటకాలతో కన్యాశుల్కంకు గల సారూప్యతగల భేద భావాలు సూక్ష్మ పరిశీలనతో సాగుతూ నాటకలక్షణ విద్వత్ సముపార్జనకు గ్రంథం అమోఘంగా ఉపకరిస్తుంది.

కన్యాశుల్కం, 19వ శతాబ్ది
ఆధునిక భారతీయ నాటకాలు
డా॥ యు.ఎ. నరసింహమూర్తి, వెల: రూ. 325/- పేజీలు: 724, ప్రతులకు: అన్ని పుస్తకషాపులు.

❉

చూద్దామా...

యాజీవ్

పక్షుల ఆవాసం -భరత్‌పూర్

వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు అటు వన్యప్రాణులకు రక్షణ కల్పించడమే కాకుండా ప్రకృతి ప్రేమికులను ఆహ్వానిస్తుంటాయి. అందుకే నిత్యం సందర్శకులతో సందడిగా ఉంటాయి. చారిత్రాత్మక కట్టడాలు, సమాధులు అంటే అంతగా ఇష్టం లేనివాళ్ళు, ప్రకృతి-వన్యప్రాణులంటే ఇష్టపడే వాళ్ళు ఇటువంటి కేంద్రాలకు వెళ్లవచ్చు. మనదేశంలో సందర్శకులను అనుమతించే వన్యప్రాణి సంరక్షణా కేంద్రాలు చాలానే ఉన్నాయి. వాటిలో ఒకటి రాజస్థాన్‌లోని భరత్‌పూర్ పక్షుల సంరక్షణ కేంద్రం.

రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, సరిహద్దు ప్రాంతంలో దాదాపు 29 చదరపు కిమీ మేర విస్తరించి ఉన్న ఈ సుందర వనం ప్రకృతి ఆరాధకులు తప్పని సరిగా చూడవలసింది. దీనినే కియోలాదేవ్ ఘనా జాతీయ వనం అని కూడా అంటారు. దీనిలో 300 రకాలకు పైగా పక్షి జాతులు కనిపిస్తాయి. దీని ప్రత్యేకత ఏమిటంటే దాదాపు 11 చకిమీ వరకు చెరువులు ఉండటం. కాబట్టి నీటి పక్షులు, వలస పక్షులు ఎక్కువగా వస్తుంటాయి. సుప్రసిద్ధమైన సైబీరియా కొంగలు కూడా భరత్‌పూర్‌కి వలస వస్తూ వుంటాయి. ఈ వనం మధ్యలో కియోలాదేవ్ దేవాలయం (శివాలయం) ఉండటం వల్ల ఆ పేరు వచ్చింది.

ఈ వనాన్ని ఒక మహారాజు నిర్మించడం మరో విశేషం. పూర్వం భరత్‌పూర్ పట్టణానికి వరదల తాకిడి ఎక్కువగా ఉండేది. దాని నుండి రక్షించుకోవడం కొరకు 1760లో అజన్ ఆనకట్టను నిర్మించారు. ఆనకట్ట నిర్మాణానికి అవసరమైన మట్టిని తవ్విన ప్రదేశం విశాలమైన భరత్‌పూర్ చెరువుగా మారింది. చెరువుని అనేక చిన్న భాగాలుగా విభజించారు. క్రమంగా ఇక్కడ అడవి బాతుల్ని వేటాడే క్రీడ మొదలైంది. అరవయ్యవ దశకాల్లో ఇక్కడ వేటను నిషేధించారు. పంతొమ్మిదవ శతాబ్దంలో వేట స్థలిగా భరత్‌పూర్ రాజా సృష్టించిన ఈ ప్రదేశం 1956లో పక్షి సంరక్షణ కేంద్రంగా ప్రకటించబడింది. అదే 1982లో జాతీయవనంగానూ, 1985 నుండి ప్రపంచ హెరిటేజ్ స్థలంగానూ ప్రకటించబడింది.

ఇక్కడ అనేక రకాల పక్షులే కాకుండా చాలా రకాల జంతువులు కనిపిస్తాయి. జింకలు, దుప్పులు, తోడేళ్ళు, ఓట్టర్ వంటి జంతువులు ఇక్కడ సామాన్యంగా సంచరిస్తుంటాయి. ఎన్ని ఉన్నా సైబీరియా నుండి వలస వచ్చే కొంగలు ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. వీటి కోసమే ప్రతి శీతాకాలంలో చాలా మంది ఇక్కడికి వస్తుంటారు. సైబీరియా కొంగలు కూడా భరత్‌పూర్ తప్ప మరో చోటికి వలసపోవు. కానీ వీటి సంఖ్య పెరగకపోవడంపై (గత సారి చూసినప్పుడు రెండే సైబీరియా కొంగలు కనిపించాయి) పక్షి ప్రేమికులు ఆందోళన పడుతున్నారు.

సందర్శకులకోసం ఈ వనం సంవత్సరం పొడవునా తెరిచే ఉంటుంది. ప్రత్యేకించి శీతాకాలంలో దీనిని చూడటం మరువలేని అనుభూతి. ఒకపక్క చిక్కటి చెట్లు, మరో పక్క చెరువులు, వాటి మధ్య గట్లపై తుమ్మ చెట్లు... చూసి తీరవలసిన ప్రదేశం. అక్టోబర్-ఫిబ్రవరి మధ్యలో వాతావరణం ఆహ్లాదకరంగా తయారౌతుంది. అంతేకాక అనేక వలస పక్షుల రాకతో వనం మొత్తం కోలాహలంగా ఉంటుంది.

భరత్‌పూర్ ఢిల్లీ నుండి 176 కిమీ. ఆగ్రా నుండి 50 కిమీ దూరంలో ఉంది. ఈ ప్రదేశాల నుండి బస్సులు, టాక్సీలు నిత్యం తిరుగుతూ ఉంటాయి. ఉండటానికి వనం దగ్గరలోనే చాలా హోటళ్లుంటాయి. కానీ భోజనం మాత్రం కాస్త ఇబ్బందే. కాబట్టి మన ఏర్పాటు మనం చేసుకోవడం మంచిది.

లోపల తిరగడానికి కాలినడకే ఉత్తమం. అయినా సైకిళ్ళు, రిక్షాలు, పడవలు అద్దెకు లభిస్తాయి. ఇతర వాహనాలను లోపలికి అనుమతించరు.

భరత్‌పూర్‌లో ప్రభుత్వ మ్యూజియం కూడా ఉంది. పూర్వకాలపు రాచరికం తాలూకు వైభవం ఇక్కడ కనిపిస్తుంది. అలాగే కాస్త దూరంలో భరత్‌పూర్, రాజ భవనం, లోహగర్ కోట, డీగ్ రాజభవనం కూడా ఉన్నాయి. రెండు మూడు రోజులు భరత్‌పూర్‌లో ఉండేలా ప్లాన్ చేసుకుంటే, చరిత్రనీ, ప్రకృతినీ కలిపి ఆస్వాదించవచ్చు.

❋

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

జరిగినకథ:
ఇండియన్లను చూసి బిగ్గరగా నవ్వాడు షెర్మాన్. తుపాకులు కిందికి దించారు కెవల్రీ సైనికులు. జూన్ 8 (సమ్మర్ మూన్ నాడు) చేతులకు సంకెళ్ళు వేసి, రైల్లో ఎక్కించి, ముగ్గురు నాయకులనూ ఫోర్ట్ రిచర్డ్సన్‌కు తరలించారు. వ్యాగన్లలో వాళ్ళ పరిస్థితి పశువులకన్నా అధ్వాన్నం. మృత్యువు అనివార్యమని తెలిసి, వృద్ధ సటాంక్, "చరమ గీతం" ఆలపించాడు. సూర్య భగవానుడా, నువ్వు శాశ్వతం, నీ వెలుగు శాశ్వతం. మా కైవ్టెంకో జాతి మాత్రం అంతరిస్తుంది. ఓ, భూ మాతా, నీకు మరణం లేదు. నేటితో కైవ్టెంకోలు నీలో తలదాచుకుంటారు.


కోచైస్

అమెరికన్ డేగ

(41వ భాగం)

రైలు కాలువ దాటుతున్నప్పుడు దూరాన ఓ చెట్టు కనిపించింది. "అక్కడికి పోలేను నేను" అంటూ రుద్ధకంఠంతో పలికాడు సటాంక్. ఒంటినిండా బ్లాంకెట్ కప్పుకుని, లోపల కండలు వూడి వచ్చినా, పైకి బాధ కనిపించనీయకుండా, సంకెళ్ళు వదిలించుకున్నాడు. బొడ్లో దోపుకున్న చురకత్తి తీసి, బిగ్గరగా అరుస్తూ, గార్డు మీదికి లంఘించాడు. ఆ తర్వాత, అతడి చేతిలోని గన్ తీసుకొని ముందుకురికినప్పుడు డ్యూటీ లెఫ్టినెంట్ "ఫైర్" అంటూ ఆర్డరిచ్చాడు. మరుక్షణమే సటాంక్ మీద గుళ్ల వర్షం కురిసింది. రైలు కొద్ది నిమిషాలాగింది. మృతదేహాన్ని కిందికి విసిరేశారు. టెక్సాస్‌కు రైలు ప్రయాణం కొనసాగింది.

జులై 5, 1871 నాడు టెక్సాస్‌లోని, జాక్స్‌బరో కోర్టులో హత్యానేరానికిగాను, సాటాంటా, బిగ్ ట్రీల మీద విచారణ ప్రారంభమైంది. బెల్టులలో పిస్టళ్లు పెట్టుకున్న రాంచర్లు, కౌబాయ్స్ న్యాయమూర్తులుగా వ్యవహరించారు. మూడు రోజుల ఏకపక్ష వాదనల తర్వాత ముద్దాయిలను నేరస్తులుగా ప్రకటించారు. అయితే, మరణ శిక్ష అమలు చేస్తే కియోవాలు యుద్ధం చేస్తారనే భయంతో, దాన్ని యావజ్జీవ కారాగార శిక్షగా మార్చి, ఆ ఇద్దర్నీ హంట్స్‌విల్ పెనిటెన్షియరీ (జైలు)కి తరలించారు.

మొత్తం మీద ఈ క్రమంలో, కియోవాలు, ముగ్గురు అనుభవజ్ఞులైన నాయకులను పోగొట్టుకున్నారు. యువకులు, చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి స్వేచ్ఛగా విహరించటానికి స్టేక్‌డ్ ప్లెయిన్స్‌కు తరలిపోయారు. తెల్లవాళ్లను తప్పించుకొని, దొరికిన జంతువులను వేటాడుతూ రెడ్ కెనడియన్ మధ్య ప్రాంతానికి చేరుకున్నారు. జీవితం సుఖంగా వుంది.

'గీస్-గోయింగ్- మూన్' రుతువు నాటికి పాలో డ్యూరో కాన్యన్‌లో గుడారాలు వేసుకొని స్థిరపడ్డారు. అది క్వాహాడీ కొమాంచీల స్వస్థలం. అయినా కియోవాలను వాళ్ళు సాదరంగా ఆహ్వానించి తమలో కలుపు కోవటానికి సిద్ధపడ్డారు.

క్వాహడీలతో కలసి వేటాడాడు లోన్ వూల్ఫ్. వాళ్లతో చాలా సన్నిహితంగా మెలిగాడు. రిజర్వేషన్ నుండి పారిపోయి వచ్చిన కియోవాల భవిష్యత్ కార్యక్రమం గురించి కికింగ్ బర్డ్‌తో గొడవ పడ్డాడు. తెల్లవాళ్ల ఆజ్ఞల్ని శిరసా వహించటం తప్ప మరో మార్గం లేదన్నారు స్టంబ్లింగ్ బేర్, కికింగ్ బర్డ్ - అంటే టెక్సాస్‌లో వేటాడటం మానెయ్యాలి. లోన్‌వూల్ఫ్‌కీ ప్రస్తావన నచ్చలేదు. వేటాడకుండా మనుగడ సాగించటం కియోవాలకు అసాధ్యమన్నాడు. రిజర్వేషన్ సరిహద్దులో వేటకు అనుమతిస్తామంటే, మరి ఆ సరిహద్దులు దక్షిణంగా, రియోగ్రాండ్ దాకా, వుత్తరాన మిస్సోరీ దాకా విస్తరించాలి.

కియోవా యువకులకు లోన్‌వూల్ఫ్ ఆదర్శ నాయకుడిలా కన్పించాడు. తరువాతి రోజుల్లో, వాషింగ్టన్ నుంచి చర్చలకు ఆహ్వానం వచ్చినప్పుడు కికింగ్ బర్డ్, స్టంబ్లింగ్ బేలను కాదని ఇతణ్ణే తను ప్రతినిధిగా ఎంచుకున్నారు. ఆగస్టు నెలలో, వివిధ అసమ్మతి తెగల నాయకులను వాషింగ్టన్‌లో చర్చలకు ఆహ్వానించింది ఇండియన్ బ్యూరో.

స్పెషల్ కమిషనర్ హెన్రీ ఆల్వర్డ్, ఫోర్ట్‌సిల్‌కు వచ్చిన ఆహ్వానం అందచేసినప్పుడు, సాటాంటా, బిగ్ ట్రీలతో సంప్రదించేదాకా తను రాలేనని స్పష్టం చేశాడు. టెక్సాస్ జైల్లో ఉన్నప్పటికీ వాళ్లే తమ నాయకులని స్పష్టం చేశారు.

"వాళ్ళ అనుమతి లేకుండా తనే నిర్ణయం తీసుకోలేడు".

గత్యంతరం లేక, ఖైదీలతో లోన్‌వూల్ఫ్ సమావేశం ఏర్పాటు చెయ్యటానికి నానా తిప్పలూ పడ్డాడు. అయిష్టంగానే తన ఖైదీలను తాత్కాలికంగా యునైటెడ్ స్టేట్స్ సైన్యానికి అప్పగించటానికి అంగీకరించాడు టెక్సాస్ గవర్నర్. కెవల్రీ కమాండర్, ఆ ఇద్దర్నీ సెప్టెంబర్ 9, 1872న డాలస్ (టెక్సాస్)లో తన అదుపులోకి తీసుకొని ఫోర్ట్‌సిల్‌కు బయల్దేరాడు. ఈ ఎస్కార్ట్ పార్టీని డజన్లకొద్దీ సైనికులు అనుసరించారు. అవకాశం దొరికితే సాటాంటా, బిగ్ ట్రీలను కాల్చి చంపటానికి సిద్ధంగా వున్నారందరూ.

ఈ కెవల్రీ బృందం ఫోర్ట్‌సిల్ సమీపిస్తున్నప్పుడు, అసిస్టెంట్ కమాండర్‌కో సందేశం చేరింది "తమ నాయకుడు సాటాంటాను సంకెళ్లు వేసి తరలిస్తున్నందుకు ఇండియన్లు కోపంగా వున్నారు. తిరుగుబాటు జరిగే అవకాశం కూడా లేకపోలేదు. వాళ్ళ వద్ద కూడా ఆయుధాలు బాగానే వున్నాయి. ఒకవేళ యుద్ధమే జరిగితే, రెండు వైపులా భారీగా ప్రాణ నష్టం వుండే అవకాశం వుంది. అందువల్ల "ఖైదీ"ని ఫోర్ట్ సిల్‌కు బదులుగా ఎమ్.కె. అండ్ టి. రెయిల్ లోడ్ స్థావరానికి తీసుకెళ్లటం మంచింది".

కమిషనర్ ఆల్వర్డ్‌కిదో కొత్త తలనొప్పి తెచ్చి పెట్టింది. సంప్రదింపులకోసమే సాటాంటా,

బిగ్ ట్రీలు వస్తున్నారని ఇండియన్లకు తెలియచెప్పడం ఎలా? ఎం.కె.అండ్ టి దాకా ప్రయాణించాలంటే మళ్లీ అందరూ రైలెక్కాల్సిందే. మొత్తం మీద, చర్చల తర్వాత, పరస్పర అంగీకారంతో, అందరూ కలిసి రైల్లో 165 మైళ్లు వ్యాగన్లలో, పశువులతో పాటు ప్రయాణించి, మిస్సోరీ, కాన్సాస్‌కు సమీపంలో ఉన్న ఇండియన్ స్థావరం అటోకాకు చేరుకున్నారు (అటోకా ఒక రైలు స్టేషన్).

ఈ ప్రహసనం పతాకస్థాయికి చేరటానికి మరికొంత సమయం పట్టింది. లోన్‌వూల్ఫ్ బృందంలో వున్న ఆల్వర్డ్‌కు సాటాంటా, బిగ్ ట్రీలను తీసుకొని కెవర్లీ వస్తున్నదన్న వార్త చేరింది. అంటే, వాళ్ళనతడు తన అదుపులోకి తీసుకోవాలి. ఇంత "ప్రమాదకరమైన" వ్యక్తులను తను 'హ్యాండిల్' చెయ్యగలడా? ఆ రైలుస్టేషన్‌లో భద్రతా ఏర్పాట్లు లేవు. ఇండియన్లందరూ వచ్చి దాడి చేస్తే తను రక్షించుకోలేడు. ఖైదీలను ఇక్కడికి తీసుకురావద్దు. ఎక్కడైనా రహస్య ప్రదేశంలో దాచండి" అంటూ కెవర్లీకి సందేశం పంపాడు.

మొత్తం మీద 29, సెప్టెంబర్ నాడు సెయింట్ లూయీలోని ఎవరెట్ హౌజ్‌లోని స్పెషల్‌రూంలలో సాటాంటా బిగ్‌ట్రీలు, మిత్రుడు లోన్ వూల్ఫ్ కంపెనీలో తమ తాత్కాలిక స్వేచ్ఛను సెలబ్రేట్ చేసుకున్నారు. చిరకాల స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకున్నారనుకున్నాడు ఆల్వార్డ్. కాని ఆ సెలబ్రేషన్ సమయంలోనే వాళ్ళు చెయ్యవలసిన పనులు కూడా చర్చించుకున్నారు. వాషింగ్టన్ వెళ్ళి లోన్‌వూల్ఫ్, తన మిత్రుల విడుదలకు వత్తిడి తీసుకురావాలి.

ఆ తరువాత నెలల్లో కియోవాలతో పాటు, ఇతర ఇండియన్ తెగల నాయకులు కూడా 'గ్రేట్‌ఫాదర్' ఆహ్వానం మీద తరలివెళ్ళారు. అక్కడ జరిగిన మంతనాలలో, అపాచీలు, అరపాహోలు, కొమాంచీలు, క్వాహాదీ కొమాంచీలు, యాపారికా తెగకు చెందిన టెన్ బేర్స్, 'పెనాటెకా'ల టోసావీ పాలుపంచుకున్నారు.

వాషింగ్టన్‌లోని సమావేశ నిర్వాహకులు, ఇండియన్లకోసం ఒక విహారయాత్ర ఏర్పాటు చేశారు. అందులో భాగంగా, సైనికుల పాటల ప్రదర్శన, ఒక మెథడిస్టు చర్చిలో ఆదివారం సందేశాన్ని ఇండియన్ల భాషలోకి అనువదించే కార్యక్రమం కూడా నిర్వహించారు. ఆ తర్వాత వైట్‌హౌజ్‌లోని ఈస్ట్‌రూంలో గ్రేట్‌ఫాదర్ 'యులిసిస్ గ్రాంట్ (ప్రెజిడెంట్) అతిథులకు స్వయంగా స్వాగతం పలికాడు. తొలి మర్యాదల తర్వాత, కమిషనర్ ఆఫ్ ఇండియన్ ఎఫైర్స్, ఫ్రాన్సిస్ వాకర్, కియోవాలు, కొమాంచీలను ఉద్దేశించి ప్రసంగించాడు.

"ఈ హాల్లో వున్న అన్ని తెగల ఇండియన్లు- వాళ్ల బంధువులు - ఫోర్ట్‌సిల్‌కు పది మైళ్ళ లోపున నివసిస్తున్న ఇతర తెగలవాళ్లెవరూ, వచ్చే డిసెంబర్ 15దాకా ఎక్కడికీ కదలకూడదు. అంతేకాదు! మా అనుమతి లేకుండా వేటకెళ్ళగూడదు.

ప్రభుత్వ ఆజ్ఞల్ని ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవు. ఇక్కడికి రాని క్వాహాడి కొమాంచీల దురాగతాలను అణచివేయటానికి ప్రత్యేక బలగాలు ఇప్పటికే ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. డిసెంబర్ 15 నాటికి,

దాడిలో, తప్పించుకున్న వందల మంది యువకులు పక్కనున్న మరో గ్రామం నుండి గుర్రాలనూ, ఆయుధాలనూ తీసుకుని సైనికుల మీద దాడిచేశారు. ఫలితంగా గుర్రాలనైతే తెచ్చుకోగలిగారు గాని స్త్రీలూ, పిల్లలూ మాత్రం కనిపించలేదు. వాళ్ళందర్నీ కోటలో ఎక్కడో దాచారు. మరికొన్నాళ్ళకు, భార్యా పిల్లలు, బంధువుల కోసం యుద్ధం చేసిన వాళ్ళంతా ఫోర్ట్‌సిల్‌కు వచ్చి రిజర్వేషన్‌లో ఉండటానికి అంగీకరించక తప్పలేదు. లొంగుబాటును వ్యతిరేకించిన క్వాహాడీలు కొందరు ఒక దళంగా ఏర్పడి, ఇతర తెగల్లో నుండి యువకులను చేర్చుకుని ప్రభుత్వానికి ఛాలెంజి విసిరారు. ఈ యోధులకు నాయకుడు ఇరవయ్యేడేళ్ల క్వానా పార్కర్.

కికింగ్ బర్డ్

ఫోర్ట్‌సిల్ నుండి పది మైళ్ళ కన్న ఎక్కువ దూరంలో వున్న ఇండియన్సందర్నీ యునైటెడ్ స్టేట్స్ తన శత్రువులుగా పరిగణిస్తుంది. అంటే షూట్ ఎట్ సైట్ ఆర్డర్లు జారీ అయ్యాయి"

టెన్ బేర్స్, టోసావీలు ప్రభుత్వ షరతుల్ని అంగీకరించారు. కాని, "కియోవాలందర్నీ నియంత్రించటం సాధ్యమా?" అంటూ సందేహం వ్యక్తపరిచాడు లోన్‌వూల్ఫ్. "ముఖ్యంగా సాటాంటా, బిగ్ ట్రీ లాంటి నాయకులను జైల్లో పెట్టినంతకాలం యువకులు విడుదల కోసం నిరసన తెలియజేస్తూనే వుంటారు. ప్రభుత్వం శాంతిని కోరుకుంటే, ఈ ఇద్దర్నీ రిజర్వేషన్‌కు తీసుకురావాలి".

ఇండియన్ల రాజనీతి చతురతకు ఇదో మంచి వుదాహరణ. అభ్యర్థనలాగ కనిపించినా, షరతులు విధించినట్టే. యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను విడుదల చేయటానికి వాకర్‌కు అధికారం లేదు. అయినా ఆ సమావేశంలో, వాగ్దానం చెయ్యక తప్పలేదు. ఇదే అదనుగా విడుదల తేదీ కూడా నిర్ణయించుకున్నాడు లోన్‌వూల్ఫ్. 1873, మార్చి చివరి నాటికి నాయకులు రిజర్వేషన్ చేసుకోవాలి.

వాషింగ్టన్ పర్యటన ఫలితంగా ఇండియన్ తెగలలో వచ్చిన మరో ముఖ్య పరిణామంతో టెన్‌బేర్స్ ఏకాకి కాకతప్పలేదు. ఇంచుమించు అందరూ లోన్‌వూల్ఫ్‌ను తమ నాయకుడిగా అంగీకరించారు. అయితే, టెన్‌బేర్స్ వృద్ధుడు, అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇండియన్ గాథల్ని ఎలుగెత్తి గానం చేసిన ఈ కవి 1872, నవంబర్ 23న మరణించాడు.

ఇక, కమిషనర్ ఆజ్ఞల్ని అమలు పరుస్తూ, స్టేక్‌డ్ ప్లెయిన్స్‌లో క్వాహాదే కొమాంచీల కోసం వేట కొనసాగింది. ఫోర్ట్ రిచర్డ్‌సన్ నుండి, ఫోర్ట్ కెవర్లీ గాలింపు చర్యల్లో పాల్గొంది. రెడ్ రివర్ ప్రాంతమంతా జల్లెడ పట్టారు. ఈ అశ్వికదళానికి నాయకుడు రానాల్డ్ మెకెంజీ. ఇండియన్లు అతణ్ణి 'మంగో హూట్' (మూడు వేళ్ళు) అన్నారు (యుద్ధంలో అతడు రెండు వేళ్ళు పోగొట్టుకున్నాడు). సెప్టెంబర్ 29నాడు, మాక్లెల్లన్ క్రీక్ ప్రాంతంలో, సైనికులకో కొమాంచీ గ్రామం కనిపించింది. వీళ్ళందరూ బుల్‌బేర్ అనుచరులు. త్వరలో చలికాలం వస్తుందని, మాంసాన్ని ఎండబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారందరూ.

ఇండియన్ల జీవన విధానం గురించి ఏ అవగాహనా లేని సైనికులు గ్రామం మీద దాడి చేసి నిరాయుధులైన ఇరవై మూడు మంది కొమాంచీలను చంపేశారు. 120 మంది స్త్రీలను, పిల్లల్నీ బంధించారు. ఒక పశువుల మందనూ, వెయ్యి గుర్రాల్నీ తరలించుకు వెళ్ళారు. అక్కడున్న 262 ఆవాసాలనూ తగలబెట్టి, రెడ్ రివర్ దక్షిణ తీరంలో రాత్రికి బస చేశాడు మెకెంజీ. దాడిలో, తప్పించుకున్న వందల మంది యువకులు పక్కనున్న మరో గ్రామం నుండి గుర్రాలనూ, ఆయుధాలనూ తీసుకుని సైనికుల మీద దాడిచేశారు. ఫలితంగా గుర్రాలనైతే తెచ్చుకోగలిగారు గాని స్త్రీలూ, పిల్లలూ మాత్రం కనిపించలేదు. వాళ్ళందర్నీ కోటలో ఎక్కడో దాచారు. మరికొన్నాళ్ళకు, భార్యా పిల్లలు, బంధువుల కోసం యుద్ధం చేసిన వాళ్ళంతా ఫోర్ట్‌సిల్‌కు వచ్చి రిజర్వేషన్‌లో ఉండటానికి అంగీకరించక తప్పలేదు. లొంగుబాటును వ్యతిరేకించిన క్వాహాడీలు కొందరు ఒక దళంగా ఏర్పడి, ఇతర తెగల్లో నుండి యువకులను చేర్చుకుని ప్రభుత్వానికి ఛాలెంజి విసిరారు. ఈ యోధులకు నాయకుడు ఇరవయ్యేడేళ్ల క్వానా పార్కర్.

1873 వసంతకాలంతో, రిజర్వేషన్‌కు వస్తున్న సాటాంటా, బిగ్‌ట్రీల కోసం పెద్ద ఎత్తున స్వాగతం పలకటానికి కియోవాలు అన్ని ఏర్పాట్లు చేశారు. నాయకులను జైల్లోనే వుంచటానికి బాల్డ్ హెడ్ టాటమ్ సర్వశక్తులా ప్రయత్నించాడు గాని కమిషనర్ ఆఫ్ ఇండియన్ అఫైర్స్ మాటే నెగ్గింది. టాటం రాజీనామా చేశాడు. అతడి స్థానంలో జేమ్స్ హావర్త్‌ను నియమించారు. బడ్ మూన్ గడిచి లీఫ్ మూన్ రుతువు ప్రవేశించే నాటికి లోన్‌వూల్ఫ్‌లో అసహనం పెరిగింది. ఇంకెన్నాళ్ళు వేచి చూడటం? నాయకులను తక్షణం విడుదల చెయ్యకపోతే టెక్సన్లతో యుద్ధం అనివార్య మన్నాడు. ఓపిక పట్టమన్నాడు కికింగ్ బర్డ్. అక్కడ, ఇండియన్లను ద్వేషించే తెల్లవాళ్ళు (సెట్లర్లు) గవర్నర్ మాట వినటం లేదు. చివరికి, ఆగస్టు (మూన్ ఆఫ్ డీర్ హార్న్స్ డ్రాపింగ్ ఆఫ్)లో సాటాంటా, బిగ్ ట్రీలను ఖైదీలుగానే ఫోర్ట్ సిల్‌కు తరలించటానికి అంగీకరించారు వాషింగ్టన్‌లోని వున్నతోద్యోగులు. ఈ వార్త తెలిసిన వెంటనే ఇండియన్లతో ఒక సమావేశం ఏర్పాటు చేశాడు టెక్సాస్ గవర్నర్.

ఇంకా వుంది....



చందు

కృష్ణభగవాన్ తన 27 ఏళ్ళ వయసులో 'మహర్షి' చిత్రంతో నటుడయ్యాడు. అక్కడ నుంచి కెరీర్ సాగించగా 42వ ఏట 'ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు' రూపంలో బ్రేక్ వచ్చింది. తానేమిటో నిరూపించుకోవడానికి 15 సంవత్సరాలు పట్టిందంటారు. నేడు బిజీ హాస్య నటుడయ్యారు. 'జాన్ అప్పారావు 40 ప్లస్' సినిమాతో కథానాయకుడయ్యారు.నిజ జీవితంలో కూడా 'కృష్ణభగవాన్ 40 ప్లస్సే'. తాజా చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ హాస్య నటుడితో సినిమా కబుర్లు...

...నాబోటి కమెడియన్‌కు సరిపడవు

'జాన్ అప్పారావ్ 40 ప్లస్' చిత్రంలో తొలిసారి సోలో హీరోగా నటించారు. మీరు నిజజీవితంలో ...?

నిజ జీవితంలో కూడా 40 ప్లస్సే.

భాగ్యరాజా తరహా పాత్రలు పోషించాలన్న కోరికను గతంలో వ్యక్తం చేశారు. 'జాన్ అప్పారావ్...'తో ఆ కోరిక నెరవేరిందని భావిస్తారా?

ఆ తరహాలో కొంత ఉంటూనే... డ్రామా, సెంటిమెంట్ ఉంటుంది. ఎలాంటి కథ అని మాత్రం అడగొద్దు. ఎందుకంటే టైటిల్లోనే సస్పెన్స్ ఉంది. నా గత పాత్రలకు భిన్నంగా ఉంటుందని మాత్రం చెప్పగలను.

మీరు రమణ మహర్షి భక్తులు కదా... ఆయన బోధల్లో మిమ్మల్ని బాగా ప్రభావితం చేసింది ఏంటి?

'నిన్ను నీవు తెలుసుకో' అని చెప్పడం.

ఇంకా...

అంతే. నిన్ను నీవు తెలుసుకోమనడమే పెద్ద గ్రంథం. అంటే అంతర్ముఖులు కావడం.

మరి 'మిమ్మల్ని మీరు తెలుసుకున్నారా'?

అబ్బే లేదండి. ఇంకా ప్రయత్నాల్లోనే ఉన్నాను. కోపం, భయం, శత్రుత్వం, అసూయ, ద్వేషం... ఇవన్నీ మామూలే. టెన్షన్స్, ఒకటనుకుంటే మరోటి జరగడం రోజువారి జీవన విధానంలో మామూలే. కాకపోతే మనల్ని మనం చెక్ చేసుకోవడానికి మహానుభావుల పుస్తకాలు పనికొస్తాయి. పరిస్థితి ప్రతికూలంగా మారితే... ఆయన చెప్పిన విషయాలు అన్వయించుకుని ప్రశాంతంగా ఉంటా.

'మహర్షి' సినిమాతో రంగప్రవేశం చేశారు. 'ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు'తో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ గ్యాప్‌లో మీ మానసిక పరిస్థితి ఎలా ఉండేది?

తొలి చిత్రం నాటికి నా వయసు 27 సంవత్సరాలు. గుర్తింపు తెచ్చిన 'ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు' రిలీజ్ నాటికి 42 సంవత్సరాలు. నేనేమిటో నిరూపించుకోవడానికి 15 సంవత్సరాలు పట్టింది. ఈ గ్యాప్‌లో ఒక రకమైన అజ్ఞానంలో ఉండడంతో నిరాశానిస్పృహలకు లోనుకాలేదు. అందుకే ఆ సమయం గ్యాప్ లేకుండా హాయిగా గడిచిపోయిందనిపించింది.

అజ్ఞానమే మేలు చేసిందన్నమాట!

అంతే కదా! అజ్ఞాని దేనికీ భయపడడు, బాధపడడు.

మీలోని హీరో, కమెడియన్ లో ఎలాంటి మార్పు గమనించారు?

కమెడియన్‌గా 10/15 రోజులు కాల్షీట్స్ ఇస్తే, హీరోగా 45/50 రోజులు ఇవ్వాల్సి వచ్చింది.

కాల్షీట్స్‌లో కాకుండా నటనలో చెప్పగలరా?

హీరో ఎక్కువ భారం మోయాల్సి ఉంటుంది. అలాగని కమెడియన్లు తక్కువేమీ కాదండోయ్! హీరోగా ఎవరు నటించినా హాస్యం బాగా పండి హిట్ అయిన చిత్రాలూ ఉన్నాయి. కాకపోతే కథానాయకుడికి బాధ్యత ఎక్కువ. ఫైట్స్ చేయాలి. ఆడి పాడాలి. అవన్నీ నాబోటి కమెడియన్‌కు సరిపడనివే. కానీ రెస్పాన్సిబుల్‌గా తీసుకుని కష్టపడాలి.

'జాన్ అప్పారావ్...' కోసం శారీరకంగా అదే... బాడీ బిల్డింగ్ లాంటివి ఏమన్నా చేశారా?

ఎప్పుడో చిన్నప్పుడు చేశానంతే. నాజూగ్గా ఉండాలని తాపత్రయపడతాను గానీ రెగ్యులర్ డైటే తీసుకుంటాను.

15 ఏళ్ళ గ్యాప్ తర్వాత నటుడిగా సక్సెస్ అయ్యారు. 'డిటెక్టివ్ నారద', 'నీకు 16 నాకు 18', 'వైఫ్ ఆఫ్ వరప్రసాద్' చిత్రాలకు మాటలు రాశారు. రచయితగా గుర్తింపు పొందాలన్న లక్ష్యం ఏమన్నా ఉందా?

భవిష్యత్ ప్రణాళికలు ఉండవని ముందే చెప్పాను కదా.... దర్శకులు శ్రీనివాసరెడ్డిగారి చిత్రానికి కథ, మాటలు అందిద్దామనుకుంటున్నాను. నటుడిగా ప్రస్తుతం బిజీగా ఉండడంతో అటు ఇంకా దృష్టి పెట్టలేదు.

బిజీ లైఫ్ ఎలా ఉంది?

ఇలాంటి లైఫే కావాలనుకున్నాం కదా! ఒక్కోసారి మానసికంగా, శారీరకంగా అలసిపోతుంటాం. అయినా ఇష్టపడే కదా ఇక్కడికొచ్చింది. సంతోషంగా ఉంటుంది.

మీరెక్కువగా సెటైరికల్ క్యారెక్టర్స్ పోషించారు. వీటి ప్రభావం మీ నిజ జీవితంపై పడిందనుకుంటున్నారా?

నా నిజ జీవిత ప్రభావమే క్యారెక్టర్ల మీద వుంటుంది.

నవ్వకుండా డైలాగ్ మాడ్యులేషన్‌తో నవ్విస్తూ ఉంటారు. మిమ్మల్ని బాగా నవ్వించే కమెడియన్స్?

రేలంగి, బ్రహ్మానందం

వారిలో మీకు ప్రత్యేకించి నచ్చినవేవి?

వాళ్ళ నటనకు నేను నవ్వడమే...

రచయిత అయి కూడా పొదుపుగా సమాధానాలు చెబుతున్నారే!

పదాలను వృథా చేయకూడదు. పొదుపుగానే వాడాలి. మహాభారతం గురించి ఓ మహానుభావుడు సింపుల్‌గా చెప్పారు.. ఏమనంటే... 'మహాభారతం నిజమైన అద్భుతం... కల్పనైతే మహాద్భుతం' అన్నారు. వేస్ట్‌గా పేజీలు చెప్పనక్కర్లేదు. మీనింగ్, పంచ్ వుంటే చాలు.

❋

బేసిన్ చెక్కి

కావలసిన పదార్థాలు:

శనగపిండి- 1 కప్పు, కోవా - రెండు కప్పులు, పంచదార- 1/ 1/2 కప్పు, ఇలాచీ పొడి - 1 టీ స్పూన్ నూనె- 1 - కప్పు, నీళ్ళు - 1/2 కప్పు

తయారు చేసే విధానం

కోవాను పాన్‌లో వేసి బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించి తీయాలి. నూనె వేసి కాగనివ్వాలి. అందులో శనగపిండి వేసి, సువాసన వచ్చే వరకు వేయించాలి. తరువాత 1 1/2 కప్పు పంచదారలో, 1/2 కప్పు నీళ్ళు పోసి పాకం పట్టాలి. బాగా పాకం రాగానే శనగపిండి, కోవా, ఇలాచీ పొడిని వేసి బాగా కలుపుతూ ఉండాలి. దగ్గరకు ఉడికితే నూనె పైకి తేలుతుంది. అప్పుడు ప్లేట్‌లో నూనె రాసి దానిలో ఈ మిశ్రమాన్ని వేసి, చల్లార్చాలి. తర్వాత నచ్చిన షేప్‌లో కట్ చేసుకోవాలి. ఇష్టపడేవారు బాదం, కాజు, పిస్తా తరుగులను వేడిమీద వేసి అలంకరించుకోవాలి. నూనె బదులు నెయ్యితో కూడా ఈ స్వీట్ చేసుకోవచ్చు.



బొప్పాయి పండ్ల హల్వా

కావలసిన పదార్థాలు

బొప్పాయి పండు ముక్కలు- 2 కప్పులు, పంచదార- 1/ 1/2 కప్పులు నెయ్యి - 1 కప్పు, ఇలాచి పొడి- 1/4 టీస్పూన్, ఎల్లో లేదా ఆరంజ్ కలర్ - 1/4 టీ స్పూన్, జీడిపప్పులు-6 , వెనీలా ఎసెన్స్ - 2 చుక్కలు, చిక్కని పాలు- 1/2 కప్పు, మైదా- 1/4 కప్పు, చెర్రీస్ - 10, నీళ్ళు- 1 కప్పు

తయారు చేసే విధానం

ముందు బొప్పాయి పండు తొక్కు తీసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. వాటిని మిక్సీలో వేసి పేస్ట్ చేసి పెట్టుకోవాలి. బాండీలో మైదా, 1 స్పూన్ నెయ్యి వేసి, మంచి సువాసన వచ్చేంత వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. పంచదారలో 1 కప్పు నీళ్లు పోసి చిక్కటి పాకం తయారు చేసుకోవాలి. పాకం మరిగేప్పుడు పాలు పోయాలి. పాలు రెండు నిమిషాలలో విరిగిపోతాయి. అందులో పసుపురంగు, మైదా, బొప్పాయి ముక్కల పేస్ట్ వేసి బాగా కలపాలి. కరిగించిన నెయ్యి వేసి కలుపుతూ అడుగంటకుండా ఉడికించాలి. తరువాత ఇలాచీ పొడి, ఎసెన్స్ వేసి కలపాలి. హల్వా లాగా అయిన తరువాత నెయ్యి రాసి ప్లేట్‌లో పోసి జీడిపప్పులు, చెర్రీలతో అలంకరిస్తే సరి. రుచికరమైన బొప్పాయి పండ్ల హల్వా రడీ!

కేసరి చికెన్

కావలసిన పదార్థాలు

బ్రాయిలర్ చికెన్- 1/1/2 కేజీ, అల్లం, వెల్లుల్లి ముద్ద - 2 టేబుల్ స్పూన్ బొప్పాయి కాయ ముద్ద - 1 టేబుల్ స్పూన్, పెరుగు- 100 గ్రాములు, కుంకుమ పువ్వు -కొద్దిగా, పసుపు రంగు - ఫుడ్‌కలర్, ఉప్పు-సరిపడినంత, వెన్న- రెండు టేబుల్ స్పూన్లు

గరమ్ మసాలాకు: మిరియాలు - 8, మెంతులు- 1 టేబుల్ స్పూను, పచ్చని యాలక్కాయలు 4-5, నల్ల యాలక్కాయలు- 4-5, లవంగాలు-6 సొంఠిముక్క - 1 అంగుళం, దాల్చిన చెక్క -2 అంగుళాల ముక్క, జాజికాయ-1, జాపత్రి- కొద్దిగా, కారం-తగినంత...అన్నీ కలిపి మెత్తగా నూరి వుండకట్టుకోండి

తయారు చేసే విధానం

చికెన్ చక్కగా కడిగి, శుభ్రం చేయండి (ముక్కలు కోయకూడదు). గరమ్‌మసాలా ఉండను అల్లం, వెల్లుల్లి ముద్దతో కలపండి. దానికి బొప్పాయికాయ నూరిన ముద్దతో కలిపి, కడిగి బాగా పట్టించి గంటసేపు ఊరనివ్వండి.

పెరుగులో కుంకుమపువ్వులను కలిపి, దానిలో పసుపు రంగును, ఉప్పును కూడా కలిపి, చికెన్‌కు పట్టించండి. మరో అరగంట సేపు ఊరనిచ్చి, ఆ కోడిని అలాగే ఒక బొగ్గుల కుంపటిమీద సెగలో చక్కగా ఉడికేంత వరకూ వెన్ననూ రాస్తూ తిప్పుతూ కాల్చండి. చక్రాలుగా కోసిన, ఉల్లి, టొమేటా ముక్కలను కోడి చుట్టూ అమర్చి, తరిగిన కొత్తిమీరను చల్లి, వడ్డించండి.



రుచి

క్యాలీ ఫ్లవర్ ఆవకాయ

కావలసిన వస్తువులు

క్యాల్‌ఫ్లవర్స్- 2, కారం - రెండు కప్పులు, నూనె- 200 గ్రాములు, ఆవాలు- 25 గ్రాములు, పసుపు - చిటికెడు నిమ్మకాయలు-2, ఉప్పు - 1 కప్పు, మెంతులు- 25 గ్రాములు, వెల్లుల్లిపాయలు-3, కరివేపాకు- 2 రెబ్బలు

తయారు చేసే విధానం

క్యాలీఫ్లవర్‌ని శుభ్రంగా చిన్న ముక్కలుగా కోసుకోవాలి. ఆవాలు పొడిగా దంచుకోవాలి. అలాగే మెంతులు కూడా వేయించి పొడి చేసుకోవాలి. ఈ రెండు పొడులు, ఉప్పు, కారం, పసుపు, వెల్లుల్లి పేస్ట్ తరిగి ఉంచిన ముక్కలకు పట్టించాలి. నిమ్మకాయ రసాన్ని గింజల్లేకుండా గిన్నెలోకి వడపోసి ఉంచుకోవాలి. పోపు గింజలు వేసుకొని ఈ పచ్చడితో కలిపి నిమ్మకాయ రసాన్ని కూడా కలపాలి. పులుపు చాలకుంటే ఇంకొంచెం నిమ్మరసాన్ని కలుపుకోవచ్చు.





నేనెవరిని?

ఏంటి ఆదివారం కూడా బిజీగా కనిపిస్తున్నారు! పనిలోపనిగా చుక్కలు కలిపేసి నేనెవరినో చెప్పకోండి చూద్దాం?

చేప బొమ్మ వెయ్యగలరా!

హాయ్! బుజ్జాయిలూ!! ఇదిగో ఇక్కడ గళ్ల మధ్యలో వున్నది నేనే. ఇంకా వెతుకుతున్నారేంటర్రా! హమ్మయ్య...ఇప్పటికైనా చూసినందుకు సంతోషం. అదిసరే గానీ... ఇదిగో నా బొమ్మ వెయ్యాలి మీరు. ఎలాగంటే... చిన్న గళ్లల్లో వున్న నన్ను చూసి పెద్ద గళ్లల్లో వెయ్యాలి. ఓకేనా! భయపడకండర్రా... ఏ గడి దగ్గర ఎలా గియ్యాలో పరిశీలనగా చూస్తే సరి. ఆర్టిస్ట్ అంకుల్ కంటే మీరే బాగా వెయ్యగలుగుతారు! మరి మొదలెట్టండీ.



B	F	C	R	I	C	K	E	T
A	L	S	T	M	J	S	P	E
S	H	O	C	K	E	Y	F	N
E	O	C	T	L	N	B	E	N
B	G	C	H	G	O	L	F	I
A	J	E	A	L	M	G	K	S
L	I	R	U	G	B	Y	T	K
L	N	P	R	S	T	J	A	N

ఏడు ఆటలు ఎక్కడబ్బా...

ఆటలంటే ఇష్టపడని పిల్లలెవరుంటారు చెప్పండి! మీక్కూడా ఇష్టమేకదా. మరైతే ఇందులో ఏడు ఆటల పేర్లు వున్నాయి. వాటిని మీరు వెతికి సున్నా చుట్టాలి. అడ్డంగానో, నిలువుగానో, క్రాస్‌గానో కనిపిస్తాయి. వెతికండి మరి.

జవాబు:
(cricket, tennis, hockey, baseball, golf, rugby, soccer)

రంగులు పులిమేద్దాం

మీకు రంగులంటే ప్రాణమని మాకు తెలుసుగా. అందుకే అర్జంటుగా వాటన్నిటినీ బయటకు తీసి ఇదిగో ఈ బొమ్మకు వేసేయండి. చూడ్డానికి ముచ్చటగా వుండాలి సుమా!

ఒకేలా కనిపించే ముక్కలేవి?

ఇది టింకూ ఆడుకునే సీసపు బక్కెట్. పాపం ఓసారి చెయ్యి జారి కింద పడి పగిలి పోయింది. ముక్కలన్నిటినీ పోగుచేసి అతికించాడు టింకూ. అయితే ఆ సమయంలో వాడు ఒక తమాషా విషయాన్ని కనిపెట్టాడు. అదేంటంటే... ఆ ముక్కల్లో రెండు అచ్చుగుద్దినట్టు ఒకేలా వున్నాయి. ఇంతకీ ఆ రెండూ ఏవబ్బా...





ఎవరి చేప ఏది?

బన్ను, మిన్ను, మన్ను, టిన్ను స్నేహితులు. ఏ పని చేసినా కలిసే చేస్తారు. ఓసారి నలుగురూ కలిసి చేపలు పట్టడానికి వెళ్లారు. నలుగురూ గేలాలు వేసి అలా కూర్చున్నారు. నాలుగు చేపలు పట్టారు. కాకపోతే గేలాలు గజిబిజిగా అయిపోయాయి. ఏం చేస్తారంటే... ఎవరు పట్టిన చేప ఏదో కనిపెట్టి సున్నాలో రాసేయండే.

కనిపెట్టండోచ్...

ఇదిగో ఇక్కడ ఎనిమిది ప్రాణులు దాక్కున్నాయి. వాటిని మీరు చిటికెలో కనిపెట్టాలి. ఇంతకీ అవేంటంటే...
1. జింక, 2.కుందేలు, 3.కప్ప, 4.ఎలుగుబంటి, 5.పాము, 6.పక్షి, 7.గబ్బిలం, 8.చేప.



ఎక్కడున్నాయో...

ఇదిగో ఈ జంతువులన్నీ కూర్చుని భోజనానికి రెడీ అవుతున్నాయికదా. ఇందులో కొన్ని వస్తువులు, ప్రాణులు, తినుబండారాలు వున్నాయి. మీరు వాటిని కనిపెట్టి సున్నాచుట్టాలి. ఇంతకీ అవేంటంటే...కాఫీ పాట్, రోలర్ స్కేట్, కొవ్వొత్తి, బాణం, బూటు, ఎలుక, పడవ, ఐస్‌క్రీమ్ కోన్, స్ట్రా బెర్రీ, స్పూన్, సీల, దువ్వెన, తాళం, బొమ్మ బాతు, తూనీగ, సుత్తి.



హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

వర్షాకాలం ... ఎండాకాలంలా ఇది పరీక్షల కాలం. పరీక్షలు పరుగెత్తుకుంటూ వచ్చేస్తున్నాయి. అందరి గుండెల్లోనూ "ఇప్పుడెలా?" అనే ప్రశ్న. సిలబస్ చూస్తే కొండలా కన్పిస్తుంది. సమయమేమో గుప్పెడే ఉంది. ఏంచేయాలి? ఎలా చదవాలి? ఎప్పుడు చదవాలి? అసలు సిలబస్ అంతా పూర్తి చేయగలుగుతామా? మంచి మార్కులు సంపాదించగలుగుతామా? విద్యార్థులందరికీ ఇదే ఆలోచన. ఇదే దిగులు.

పరీక్షలంటే భయమేల !

"పరీక్ష" అంటేనే భయపడుతుంటారు. నిజం చెప్పాలంటే పరీక్ష అనేది టాలెంట్‌ని నిరూపించుకునే వేదిక. ఒక గొప్ప అవకాశం. మీరు నేర్చుకున్నదాన్ని మీ స్వంత బాణీలో రాయటం మాత్రమే. ఇంకా చెప్పాలంటే పరీక్ష చాలా తేలికైనది, సులభమైనది. ఎందుకంటే మీకు ముందుగా తెలియజేసిన, బోధించిన పాఠాలలోనే ప్రశ్నలు అడుగుతారు. కానీ, ఎంతోమందికి పరీక్షలంటే భయం! భయం! చదువుకున్నవారికీ భయమే, చదువుకోని వారికీ భయమే.

భయం ఎందుకు?

పరీక్షలంటే ఇలా తల్లడిల్లిపోవడానికి ప్రధాన కారణం చిన్నప్పట్నుంచీ ఏర్పరచుకున్న నెగటివ్ ఇంప్రెషన్. పరీక్షాఫలితాలు రెండు విధాలుగా బయటపడతాయి. పాస్ కావటం, లేదా ఫెయిల్ అవ్వడం. సరిగ్గా శిక్షణ పొందామా? లేదా? సరిగ్గా ప్రిపేర్ అయ్యామా అనే విషయాన్ని పక్కన పెడితే అందరూ "ఫెయిల్ అవ్వకూడదు" అని భావించటం వల్ల పరీక్ష అనే పదాన్ని 'భయం' తో ముడిపెట్టడం జరుగుతుంది. సరిగ్గా ప్రిపేర్ కానివారి సంగతి పక్కన పెడితే, బాగా చదువుకున్నవారికి కూడా భయం ఎందుకు కలుగుతుంది? ఎందుచేత పరీక్షలు బాగా రాయలేకపోతుంటారు? అనే ప్రశ్నలకు మనోవిజ్ఞానశాస్త్రవేత్తలు కొన్ని కారణాలను చెపుతారు.

న్యూరోటిక్ పర్సనాలిటీ

బాల్యదశలో ఉన్నప్పుడు పిల్లలు తల్లిదండ్రులతోనూ, ఇతర వ్యక్తులతోనూ, సామాజిక పరిస్థితులతోనూ సరైన సర్దుబాటు ధోరణి అలవర్చుకోకపోవటం చేత పర్సనాలిటీ లోపాలు ఏర్పడే అవకాశాలున్నాయి. ఇగో, సూపర్ ఇగోల మధ్య సంఘర్షణ ఏర్పడటం వల్ల ఇటువంటి పరిస్థితి ఉత్పన్నమవుతుంది. ఇలాంటివారినే సైకాలజీలో "న్యూరోటిక్ పర్సనాలిటీస్" అని అంటారు. వీరిలో అకారణ భయాలు, ఆందోళనలు కల్గుతుంటాయి. వీరికి పరీక్షలు సమీపిస్తున్నాయనగానే భయాందోళనలు కమ్ముకుంటాయి. దీనినే యాంగ్జయిటీ న్యూరోసిస్ అని అంటారు. ఊపిరి సరిగ్గా తీసుకోలేకపోవటం, ఛాతీ నొప్పి, చెమటలు పట్టడం, నిస్సత్తువ, కడుపునొప్పి, తలనొప్పి, పల్స్ రేటు పెరగటం, నోరు, పెదాలు ఎండిపోవటం, కండరాలు బిగపట్టేయటం, అరిచేతులు, అరికాళ్ళు చెమ్మబారటం వంటి సొమాటిక్ లక్షణాలు కన్పిస్తాయి.

ప్యానిక్ ఎటాక్

ఏమైనా సరే "సక్సెస్ తప్పనిసరి" అని అనిపించటం ఇందుకు ప్రధాన కారణం. పరీక్షల తర్వాత జీవితాన్ని ఊహించలేని స్థితిలో పాస్ కావటమే "ఆఖరి" అవకాశంగా భావించటంతో పరీక్ష అనే భయోత్పాతాన్ని తప్పించుకునే నేపథ్యంలో అన్‌కాన్షస్ చేపట్టే రక్షణ చర్యే ప్యానిక్ ఎటాక్. పరీక్ష హాలులోకి అడుగు పెట్టగానే కళ్ళు బైర్లు కమ్మి నెర్వస్ బ్రేక్‌డౌన్ ఏర్పడుతుంది.

వైఫల్యం

పరీక్షలను ఎలాగైతే మనం తప్పుగా అర్థం చేసుకుంటామో, వాటి ఫలితాల విషయంలో కూడా అలాగే పప్పులో కాలేస్తాం. వైఫల్యం అనే మాట చాలా కఠినమైనది, ఎవ్వరూ



అంగీకరించలేనిది. దేనికైనా సరే "ఫీడ్ బ్యాక్" ఉంటుందే తప్ప, "ఫెయిల్యూర్" ఉండదు. అయితే విద్యార్థులలో ఓటమిని అంగీకరించే తత్వం లేకపోవటం వల్ల పరీక్షలలో ఫెయిల్ అవుతామనే భయానికి లోనుకావటం జరుగుతుంది. పరీక్షల్లో తాము నేర్చుకున్నది బయటపెట్టేందుకు తాము ఏ విధంగా ప్రిపేర్ కావటం జరిగిందో విశ్లేషించుకున్నా, లేకపోయినా పరీక్షల్లో విజయాన్ని మాత్రమే వీరు ఎక్కువగా కోరుకుంటారు. విశ్లేషణారహితమయిన కోర్కె ఎంత ఎక్కువ ఉంటే "అపజయం" తప్పదేమోనన్న భయాందోళనలు అంత ఎక్కువవుతాయి.



సిట్యుయేషనల్ యాంగ్జయిటీ

బాగా చదివే పిల్లలో సైతం ఇది ఏర్పడుతుంది. ట్రైన్‌కి టైం అవుతోందనగానే కొంతమందికి గుండెల్లో గుబులు, కడుపులో అదోలా అనిపించటం లాగానే, ఈ పిల్లలకు పరీక్ష హాలులోకి వెళ్లగానే అక్కడి వాతావరణం, సిట్యుయేషన్ వారిలో యాంగ్జయిటీని కల్గిస్తుంది. సందర్భాన్ని బట్టి ఏర్పడేది కాబట్టే దీన్ని సిట్యుయేషనల్ యాంగ్జయిటీ అంటారు. దీని ప్రభావం వల్ల ...చదివింది గుర్తురాదు. క్వశ్చన్ పేపర్ అర్థం కాదు. ఏదో నామమాత్రంగా రాసి పరీక్ష అయ్యిందనిపించి బయటపడతారు. ఇంటికి వచ్చిన తర్వాత క్వశ్చన్ పేపర్‌ని వివరించి చెప్పే సమయంలో ఇవన్నీ తనకి బాగా తెలిసినవే అని గుర్తిస్తారు. ఇక్కడ కాన్షస్, అన్‌కాన్షస్ మైండ్‌ల పనితనమే ప్రభావం చూపిస్తుంది. మనం నేర్చుకున్నదంతా మన అన్‌కాన్షస్‌లో నిల్వ ఉంటుంది. ఈ సమాచారం మన కాన్షస్ మైండ్‌కు నిరాటంకంగా సరఫరా కావాలంటే కాన్షస్ మైండ్ ప్రశాంతంగా ఉండాలి. సిట్యుయేషనల్ యాంగ్జయిటీకి లోనైనప్పుడు కాన్షస్ మైండ్ కల్లోల భరితంగా ఉంటుంది. ఫలితంగా అన్‌కాన్షస్ ద్వారాలు మూసుకుపోతాయి. పరీక్ష అయిపోయిన తర్వాత రిలీఫ్ ఏర్పడ్డం వల్ల కాన్షస్ మైండ్ ప్రశాంతమవుతుంది. అప్పుడు అన్‌కాన్షస్‌లో ఉన్న సమాచారం నిరభ్యంతరంగా కాన్షస్ మైండ్‌లోకి ప్రవేశిస్తుంది. చాలామంది పిల్లలకు "అయ్యో! బాగా తెలిసున్నాసరే, ఆన్సర్ రాయలేకపోయానే!" అని నాలుకకరుచు కోవటానికి కారణం ఇదే.



ఒత్తిడి

శారీరక, మానసిక పరిస్థితుల్లో చెప్పుకోదగ్గ అపవ్యవస్థలు లేకపోయినా, నేటి విద్యారంగ పరిస్థితులు పిల్లల్లో తీవ్రమైన ఒత్తిడి, ఆందోళనను కల్గించేవిగా ఉన్నాయి. షెడ్యూలు ప్రకారం పోర్షన్ కంప్లీట్ కాకపోవటం, వివిధ కారణాల వల్ల క్లాసులు సరిగ్గా జరగకపోవటం, ప్రతి సబ్జెక్ట్‌లోనూ సిలబస్ విస్తరించటం వల్ల పిల్లలకు పరీక్షల ప్రిపరేషన్‌కు టైం పరిమితం కావటం, రిఫరెన్స్‌లు చూసే టైం లేకపోవటం, రివిజన్‌కు సరైన గైడెన్స్ కొరవడటం జరుగుతుంది. అలాగే, పరీక్షల్లో విద్యార్థులు సాధించబోయే ఒక్కొక్క మార్కుకీ గట్టిపోటీ ఏర్పడటం, పిల్లలు పాస్‌కావటానికి పెట్టే షరతులు వారిని విపరీతంగా భయాందోళనలకు గురి చేస్తున్నాయి. పరీక్షల తర్వాత ఎదురుకాబోయే పై చదువులు, ఉద్యోగాలు వంటి రంగాలలో ఎక్కడపడితే అక్కడ పోటీ కారణాల వల్ల విద్యార్థులకు పరీక్షలంటే టెన్షన్ పెరుగుతుంది.



ఇతర కారణాలు

ఒంట్లో బాగుండకపోవటం, పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ఇతర పనుల్లో మునిగి ఉండటం, అభిమాన హీరోలు, క్రికెట్, ఫ్రెండ్స్, లవ్ ఎఫైర్స్ వగైరాల వల్ల పరీక్షలు దగ్గరపడేంతవరకూ పుస్తకం తీసే టైం దొరక్క పరీక్షలంటే భయపడటం జరుగుతుంది.

మరైతే ఏం చేయాలి?

దీర్ఘకాలికంగా ప్రణాళికలను రూపొందించుకోవటానికి ఇప్పుడు సమయం లేదు. చదువుకునే సమయం, నేర్చుకునే సమయం, రివిజన్ సమయం అంతా గడిచిపోయింది. ఇప్పుడు మిగిలివున్న ఈ కాస్త సమయాన్ని ఉపయోగించుకుని పరీక్షలను రాయగల్గాలి. ఆఖరి నిముషంలోనే అయినప్పటికీ మీరు ఇప్పుడు తీసుకునే చర్యల ఫలితం మాత్రం పరీక్షల్లో మీ పెర్ఫార్మెన్స్‌ని ఎంతో ప్రయోజనకరంగా ప్రభావితం చేస్తుంది.

ప్రశాంతంగా ఉండాలి

సిట్యుయేషనల్ యాంగ్జయిటీ, ప్యానిక్ ఎటాక్,

ప్రణాళిక వేసుకోండి

దేనికైనా ప్లానింగ్ చాలా అవసరం. ఇప్పుడు మీకు చేతిలో ఉన్న టైం చాలా తక్కువ. చదవాల్సింది చాలా ఎక్కువ. అంచేత సరైన స్టడీ ప్లాన్ వేసుకుని దానిని నిక్కచ్చిగా అమలు చేయండి. * సరిగ్గా ఎన్నిరోజుల సమయం ఉన్నదో లెక్కించండి. * ఒక్కో సబ్జెక్టులో ఎన్ని పాఠాలున్నాయో చూడండి. * కనీసం ఒక్కో సబ్జెక్టులో రోజుకు మూడు పాఠాలయినా చదవాలని తీర్మానించుకోండి. * రోజు మొత్తంలో మీరు మెలకువగా ఉండే గంటలెన్నో లెక్కించండి. అందులో ఒక గంట రిలీఫ్ కార్యక్రమానికి వదిలిపెట్టండి. * వీలైనంత మేరకు సిలబస్ అంతా కవరవ్వాలని నియమం పెట్టుకోండి. * ఏరోజు రివిజన్ ఆరోజే చెక్ చేసుకోండి. నేర్చుకోలేకపోయిన ప్రశ్నలను, లేదా పాఠాలను విడిగా నోట్ చేసుకోండి. అందుకు కారణాలు రాసుకోండి. * చివరి కాలమ్‌లో సంతకం పెట్టండి.

యాంగ్జయిటీ న్యూరోసిస్ వంటివి ఏర్పడకుండా ఉండటానికి మీరు మానసిక ప్రశాంతతను రెగ్యులేట్ చేసుకోవటం అలవర్చుకోవాలి. సెల్ఫ్ హిప్నోసిస్‌లో దీనికొక సింపుల్ ఎక్సర్‌సైజ్ ఉంది. హిప్నోసిస్ అనగానే చాలా టైం పడుతుందని అపార్థం చేసుకోకండి. ప్రతిరోజూ ఒక నిర్ణీత సమయానికి పది నిముషాలపాటు ఈ ఎక్సర్‌సైజ్ చేస్తే ప్రశాంతతను అలవర్చుకోవటం మీకు తేలికవుతుంది. మీకు నచ్చే, ప్రశాంతంగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోండి. మీ ధ్యాసంతా ఒక బిందువుపై కేంద్రీకరించండి. ఆ బిందువు మీ ఎదురుగా వున్న ఒక చుక్క కావచ్చు, లేదా మీరు కళ్లు మూసుకుని ధ్యానం చేసినట్లైతే ఏదైనా ఒక చిన్న భావన కావచ్చు. మీ దృష్టంతా దానిమీద కేంద్రీకరించటం మాత్రమే ఇక్కడ అనివార్యం. అలా మీరు దృష్టి కేంద్రీకరించిన రెండు, మూడు నిముషాలలోనే మీలో ట్రాన్స్ స్థితి యాక్టివేట్ అవుతుంది. అప్పుడు మీరు ఈ క్రింది మూడు సజెషన్లను ఒక్కొక్కటి ఏడు సార్లు చొప్పున మీ అన్‌కాన్షస్‌కు అందివ్వాలి. 1. ఇప్పుడు నేనెంతో ప్రశాంతంగా ఉన్నాను. 2. నా మనసు, శరీరం రెండూ మరింత ప్రశాంతంగా ఉన్నాయి. 3. నేను ఇంకా ఇంకా ప్రశాంతంగా ఉన్నాను. ... ఇప్పుడు మీ మనసంతా ఎంతో ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా మారిపోతున్న స్థితిని పరిపూర్ణంగా అనుభూతి చెందండి. ఈ మానసిక స్థితి మీ అన్‌కాన్షస్‌కు అలవాటు చేయండి. మీకు కావలసినప్పుడల్లా మూడు అంకెలు లెక్కపెట్టగానే, మీ అంతరంగానికి అలవాటైన ఈ ప్రశాంతత ఒక్కసారిగా మీ మనసంతా నిండిపోయేలా ఒక పోస్ట్ హిప్నోటిక్ సజెషన్ ఇచ్చుకోండి. మీలో ఇకపై ఎప్పుడైనా సరే యాంగ్జయిటీ తలెత్తగానే ఒకటి,.......,రెండు,......... మూడు,... అని అంకెలు లెక్కపెట్టేసరికి మీ మనసంతా ప్రశాంతత అలుముకుంటుంది.

రిలీఫ్ పొందండి

మీరు వేసుకునే షెడ్యూలులో మీరు అప్పుడప్పుడు రిలీఫ్ కావడానికి వీలుగా ఒక గంట, లేదా గంటన్నర సేపు రివిజన్‌కి వదిలిపెట్టి మానసికోల్లాసాన్ని కల్గించే పనులు చేయండి. ఆహ్లాదకరంగా ఉండే ప్రదేశాలకు వెళ్ళడం, ప్రకృతిని ఆస్వాదించటం, స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవటం మంచిది. రిలీఫ్ కోసం అంటూ టీవీ చూడకండి. టీవీలో చూపే కార్యక్రమాల వల్ల, వాటి కథాంశాల వల్ల మీ మైండ్ డైవర్ట్ అయ్యే అవకాశం ఉంది. చక్కని సంగీతం వినటం కూడా ఒక మంచి అలవాటు.

బి.ఇ.ఎమ్ టెక్నిక్

ఎప్పటికప్పుడు రివైజ్ చేసుకోవటం ఎంత ప్రయోజనకరమో అదే పనిగా ఏకధాటిగా చదవటం అంత ప్రయోజనకరం కాదని విద్యామనోవైజ్ఞానిక శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అదే పనిగా చదువుతూంటే బ్రెయిన్‌కి గ్లూకోజ్, ఆక్సిజన్‌లు నిరాటంకంగా సరఫరా కావటంలో హెచ్చుతగ్గులు ఏర్పడటం సహజంగా జరుగుతుంది. వీటి దుష్ఫలితాలు మీరు చదివే చదువుమీద పడుతుంది. ఆ క్రమంలో మీ మైండ్ ఒక ప్రక్రియలో మాత్రమే సమాచారాన్ని ఆర్జిస్తుంది. ఈప్రక్రియలో మెదడు ముందుగా చదివినదాన్నీ, చివరగా చదివినదాన్నీ బాగా గుర్తు పెట్టుకుంటుంది. మధ్యలో చదివింది సరిగ్గా నమోదు కాదు. దీని ఆధారంగానే బి.ఇ.ఎమ్ ప్రిన్సిపుల్ రూపొందింది. ఏకధాటిగా చదవాల్సిన ప్రశ్నలను తీసుకుని ఒకేసారి ఏకబిగిన చదవకుండా ఒక అరగంట చదవటం, ఐదు నిముషాలు గేప్ ఇవ్వటం, తిరిగి మరో అరగంట చదవటం, మళ్ళీ గేప్ ఇవ్వటం చేస్తూ చదవాలి. ఇందువల్ల మీరు చదివిన దానిలో ఎక్కువభాగాన్ని గుర్తుంచుకోవటం జరుగుతుంది. ఈ ప్రిన్సిపుల్ ప్రకారం ఇలా గేప్ ఇవ్వకుండా చదివితే మధ్యలో చదివిందంతా మరుగైపోయే ప్రమాదం ఉంది. అంచేత మనం ముందు చెప్పుకున్నట్లు గేప్ ఇచ్చుకుంటూ చదవాలి.



కథా నిలయం
శ్రీకాకుళం

రివిజన్ జాగ్రత్తలు

మీరు వేసుకున్న షెడ్యూలు ప్రకారం ఆయా సబ్జెక్టులను తీసుకుని ముందుగా మానసిక ప్రశాంతతకు, రిలాక్సేషన్‌కి ఐదు నిముషాలు కేటాయించండి. మీ మైండ్ పూర్తిగా చదువు మీదకు మళ్లించండి. ఇప్పడు మీరు చదివే ప్రశ్న జవాబులు, కీలకాంశాలు అన్నీ యథాతథంగా మీ మనసులో ముద్రింపబడతాయని అనుభూతి చెందండి.* ప్రతి పాఠంలోని కీలకాంశాలను ఆ పాఠం చివరన ఇవ్వడం జరుగుతుంది. వాటిని క్షుణ్ణంగా చదవండి.* కీలకాంశాలను కవర్ చేసే ప్రశ్నలే ఇంపార్టెంట్ ప్రశ్నలు. పరీక్షల్లో వీటికే ప్రాధాన్యత ఎక్కువ. అంచేత ముందుగా ఈ ప్రశ్నలను బాగా చదివి నేర్చుకోండి. * లెక్కలు విషయంలో మీకు మీ టీచర్స్ అందించిన గైడ్ లైన్స్ ప్రకారం ముఖ్యమైన లెక్కలన్నింటినీ శ్రద్ధగా, ఇప్పడే మొదటిసారి చేస్తున్నట్లుగా వరుసగా చేయండి. * లెక్క మొదలు పెట్టగానే మీకు ఫార్ములా గుర్తురాని లెక్కలను కనీసం ఏడు సార్లు వరుసగా చేయండి. దీనివల్ల న్యూరోట్రాన్స్‌మిషన్ మరింత చక్కగా పటిష్టమవుతుంది. ఆ లెక్కను మీరు కచ్చితంగా పరీక్షల్లో చాలా బాగా చేస్తారు. * ఇంగ్లీష్ పరీక్షకు సంబంధించి ముఖ్యమైన గ్రామర్ టిప్స్‌ను కవర్ చేసే ప్రశ్నలన్నింటినీ ఉదాహరణల్లో ఇచ్చిన పేర్లను అటూ, ఇటూ మార్చి ప్రాక్టీసు చేయండి. లేదా, మీ స్వంత వాక్యాలను ప్రయోగించండి. * రివిజన్ మెటీరియల్ అంతా ఏ సబ్జెక్ట్‌కు ఆ సబ్జెక్ట్ విడిగా ఫైల్ చేసుకుని ఎప్పుడూ అందుబాటులో సిద్ధం చేసుకోండి * ఇంపార్టెంట్ అని వర్గీకరింపబడిన ప్రశ్నలలో మీరు ఎక్కువగా శ్రమ పడవలసిన ప్రశ్నలకు ప్రాధాన్యత ఇవ్వండి. * ఆయా అంశాలలో మీకు విషయం క్షుణ్ణంగా అర్థమయితే దానిని నేర్చుకోవటం సులువు అనిపించినప్పుడు మీ స్టడీ అవర్స్‌ని పర్యవేక్షించే సబ్జెక్ట్ టీచర్లను ఎక్స్‌ప్లెన్ చేయమని కోరండి. * మీరు నేర్చుకున్న ప్రశ్నలను ఎప్పటికప్పుడు మీ స్నేహితులకు గానీ, ఇంట్లో వ్యక్తులకు గానీ అప్పచెప్పండి. * కఠిన పదాలతో, సుదీర్ఘంగా ఉండే ప్రశ్నలను ఒకసారి చూడకుండా రాయండి. ఇలా రాసేటప్పుడు మీరు ఒక అంశాన్ని మైండ్‌లో పెట్టుకోవాలి. ప్రశ్నకు సంబంధించిన కీలకాంశాలన్నీ మీ జవాబులో ఒక వరుసక్రమం ప్రకారం కవరవ్వాలి. అలా కవర్ అయ్యేంత వరకూ అ జవాబును మళ్లీమళ్లీ రాయండి. * గత పరీక్షలకు సంబంధించిన మూడు టెర్మినల్ టెస్ట్ పేపర్లు సంపాదించండి. ఆయా పేపర్లలోని ప్రశ్నలన్నింటికీ (ఛాయిస్ ప్రశ్నలతో సహా) జవాబులు రాయండి. * టాలెంట్ పరీక్షలకు అటెండ్ అవ్వండి.

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి

వేళకు భోజనం చేయటం తప్పనిసరి. దీనివల్ల శరీరానికి కావలసిన పౌష్టికత అంది, మెదడు కూడా శక్తివంతంగా పనిచేస్తుంది. ఎక్కువ తింటే నిద్ర వస్తుంది అనుకోవటం ఒక దురభిప్రాయం మాత్రమే. తగిన ఆహారంతోపాటు పళ్ళు, పండ్ల రసాలు తీసుకుంటుండాలి. మరీ భుక్తాయాసం వచ్చేలా కాకుండా పరిమితంగా భోంచేస్తూ, ప్రతీ మూడున్నర గంటలకోసారి ఆహారాన్నికానీ, పళ్ళుగానీ తీసుకుంటూండాలి. * మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌లో మాంసకృతులు ఎక్కువ ఉండే ఇడ్లీ, దోసె, అటుకులు, ఉడికించిన గుడ్లు, బ్రెడ్ ఇష్టపడేవారైతే, జున్ను, వెన్న, గుడ్డు తినాలి. * మధ్యాహ్నం భోజనంలో అన్నంతోపాటు సలాడ్ తప్పనిసరిగా తీసుకోవాలి. పప్పుధాన్యాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. * రాత్రి భోజనంలో అన్నానికి బదులు చపాతీలు, జొన్నరొట్టెలు, గోధుమ రవ్వ ఉప్మా ఏదో ఒక వెరైటీని తీసుకుని పెరుగుపచ్చడితో తింటే చాలా మంచిది. * రాత్రిళ్ళు మేలుకుని చదివేటప్పుడు కాఫీ, టీలకు బదులు పాలు తాగటం మంచిది. ఖర్జూరం, ఎండు ద్రాక్ష, నానబెట్టి వాటి రసాన్ని పిండి తీసుకోవటం చాలా మంచిది. ఎండలు ముదిరాయి కాబట్టి కొబ్బరినీళ్ళు కూడా చాలా మేలుచేస్తాయి. * స్నాక్స్ తీసుకునేటప్పుడు పండ్లు, జామకాయలు, మొక్కజొన్న, వేయించిన శెనగపప్పు, మరమరాలు వంటివి తీసుకోవాలి. మసాలాలు దట్టించిన దినుసులను తగ్గించాలి. * పరీక్షలు పూర్తయ్యేవరకూ సాఫ్ట్‌గా ఉండే ఫుడ్ ఐటమ్స్‌ని తీసుకుంటే జీర్ణశక్తికి ఎక్కువభారాన్ని మోపకుండా పౌష్టికతను పొందవచ్చు.

పరీక్షలనేవి మనం ఎదుర్కొనలేని సంఘటనలెంత మాత్రమూ కాదు. మనం నిత్యజీవితంలో రకరకాల వ్యక్తుల మధ్య, రకరకాల విషయాలతో జీవిస్తున్నాం. దీనికి తోడు మన సమాజంలో పలురకాలైన ఇబ్బందులు... మంచినీటి సమస్య, కరెంటు కోత, వాతావరణ కాలుష్యం, అనేకం మనకు సవాళ్ళను విసురుతూనే ఉన్నాయి. ఇలా మన జీవన గమనంలో ఎన్ని రకాల సమస్యలకు వత్తిళ్ళకు ప్రతిఘటనను చూపుతూ జీవించగల్గుతున్నామంటే దీంతో పోలిస్తే పరీక్షలనేవి చాలా తేలికైన విషయాలు. వీటిని మనం మనకున్న శక్తిసామర్థ్యాలతో ఇంతకన్నా ఎక్కువ సమర్థవంతంగా ఎదుర్కోగలం. అందుచేత వేటికీ భయపడని మనం కేవలం పరీక్షలంటేనే భయం అని అనుకోవటం పూర్తిగా అవివేకం. చదివినవి ఏవిచ్చినా చక్కగా పొందికగా, అత్యద్భుతంగా రాయగలనని విశ్వసించండి. రాయలేకపోయినవాటిని గురించి బెంగపడకండి.

బెస్ట్ ఆఫ్ లక్ !



కథ

కె. అంజన

పాపాయి డైరీ

అమ్మా...
నాన్నా... నానమ్మా... తాతయ్యా...
అమ్మమ్మా..ఇంకో తాతయ్యా... అందరూ నా మాట వినరూ! నా గుండె ఏం కోరుకుంటుందో వినరూ! నన్ను ఇలా పిండంగానే చంపేయకండి. నాకు పాపాయిగా అమ్మ చేతుల్లోకి రావాలని వుంది. నేను పుట్టి పెరిగాక మీ అందరికీ సంతోషాన్నే ఇస్తానమ్మా. మంచి పేరు తెచ్చిపెడతానమ్మా. మీరు ఇప్పుడు నా చెయ్యి పట్టుకుని నడిపిస్తే... నేనేమో మీరు ముసలివాళ్లయ్యాక మీ రెండు చేతులు పట్టుకుని నడి పిస్తానమ్మా. చిన్నప్పుడు మీరు నాకు ఇచ్చిన ప్రేమకంటే చాలా చాలా ఎక్కువ ప్రేమను తర్వాత మీకు అందిస్తానమ్మా.. అమ్మా! నువ్వు చెప్పు. నీ మనసులో ఏముందో! నాకు తెలుసు. తల్లికి ఆడపిల్లయినా... మగ పిల్లాడయినా ఒకటేనని.

అక్టోబర్ 5:

యా...హూ.... నేను ఇవాళే అమ్మ బొజ్జలోకి వచ్చాను. అందుకు నాకు చాలా సంతోషంగా వుంది తెల్సా. నాకు ఎంతో ఇష్టమైన అమ్మలో నేనున్నాను. ఎంత హాయిగా వుందో ఇక్కడ. నాకు ఎలాంటి భయమూ లేదు. ఎందుకంటే నా చుట్టూ అమ్మ వుందిగా. తమాషా ఏంటంటే...నా గురించి అమ్మకూ, నాన్నకూ కూడా ఇంకా తెలీదు. నేను చాలా చిన్నగా వున్నాను. ఎంత చిన్నగా అంటే... ఆవగింజ కంటే చిన్నగా వున్నాను! ఇంకా... నా చర్మం లేత గులాబీ రంగులో వుంటుంది. కళ్లేమో తేనె కళ్లు. వెంట్రుకలేమో నల్లగా నిగనిగలాడుతూ వుంగరాలు తిరిగినట్టు పెరుగుతాయి. ఇంకా నేను పాపను. బుల్లి రాణీగారినన్నమాట. ఇవన్నీ నాకెలా తెల్సంటే... మన అమ్మానాన్నలను బట్టే మన చర్మం, కళ్లు, వెంట్రుకలు... ఎలా వుండాలో నిర్ణయం అవుతుందంట. అసలు విషయం మర్చేపోయాను! తొమ్మిది నెలలు ఆగితే హాయిగా అమ్మ ఒడిలోకి వచ్చేస్తాను. అందుకే ఇవాళ చాలా చాలా...సంతోషంగా వున్నా.

అక్టోబర్ 19:

అమ్మకు ఇంకా నా గురించి తెలీనేలేదు. నాకైతే ఇది భలే బావుంది. అమ్మకు తెలీకుండానే అమ్మ బొజ్జలో పెరగడం ఎంత తమాషా విషయమో. ఈరోజు అమ్మ కాళ్లకు, చేతులకు గోరింటాకు పెట్టుకుంది. ఎంత బావుందో! అమ్మ తెల్లగా వుంటుందికదా. గోరింటాకేమో ఎర్రగా పండింది. ఇంక పైగా నాన్న కొత్తగా తెచ్చిన జాలర పట్టాలు పెట్టుకుంది. అమ్మ పాదాలు ఎంత ముద్దుగా వున్నాయో! అమ్మ నడుస్తూ వుంటే పాదాల వంకే చూడాలనిపించింది.

అక్టోబర్ 23:

నా నోరు ఇప్పుడిప్పుడే తెరుచుకుంటోంది. నేను పుట్టాక కిలకిలా నవ్వుతాను. తర్వాత చిన్న చిన్నగా మాట్లాడతాను. నేను పలికే మొట్టమొదటి మాట ఏంటో తెల్సా... 'అమ్మ'. పెద్దవాళ్లు పిల్లలకు మొదట 'అత్త' అనడం నేర్పిస్తారుకానీ.... నాకు మొట్టమొదట 'అమ్మ' అనడమే ఇష్టం.

అక్టోబర్ 25:

ఇవాళ నా గుండె సొంతగా కొట్టుకోవడం మొదలెట్టింది. ఇవాల్టి నుంచి అది ఇంక ఎప్పటికీ కొట్టుకుంటూనే వుంటుంది. ఇంక దానికి రెస్ట్ అనేదే వుండదు. గుండెను చూస్తుంటే భలే గర్వంగా వుంటుంది. ఎందుకంటే పాపం అది విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తుంది. అలా చాలా సంవత్సరాలు పనిచేసీ పనిచేసీ...ఎప్పటికో నేను బామ్మనయ్యాక రెస్ట్ తీసుకుంటుంది. అప్పుడు నేను చచ్చిపోతాను. అన్నట్టు...కొంతమంది పుట్టుకతోటే రోగాలతో పుడతారు. కానీ...నా గుండె చాలా ఆరోగ్యంగా వుంది. నేను చాలా ఆరోగ్యంగా పుడతాను. అమ్మను అస్సలు ఏడిపించను.

నవంబర్ 2:

రోజు రోజుకీ నేను కొద్ది కొద్దిగా పెరుగుతున్నాను. నా కాళ్లు చేతులు ఒక రూపంలోకి వస్తున్నాయి.

నవంబర్ 12:

నా చేతులకు చిన్ని చిన్ని వేళ్లు వస్తున్నాయి. అవి ఎంత చిన్నగా తమాషాగా వున్నాయో! ఇంకా చాలా రోజులయ్యాక...నేను అమ్మ చేతుల్లోకి వస్తాను. నా చేతులతో ఎంచక్కా అమ్మ వెంట్రుకలు పట్టుకుని ఆడుకుంటాను. అమ్మ అప్పుడు నన్ను చూసి ప్రేమగా నవ్వుతుంది. మెల్లగా తన వెంట్రుకలను నా చేతిలోంచి తీసేస్తుంది. అప్పుడు నేను నా చిన్ని పెదాలు బిగించి ఏడవబోతే... అమ్మ ఊరుకుంటుందా! నా అరచేతులు పట్టుకొని ముద్దు పెడుతుంది. అప్పుడు నేను కూడా నవ్వేస్తాను. ఇంకా నా చిట్టి చేతులతో పెరట్లో పూస్తున్న రంగురంగుల పువ్వులు కోస్తాను. నాన్న బొజ్జ మీద కూర్చుని ఆడుకుంటాను.

నవంబర్ 20:

అమ్మ డాక్టర్ దగ్గర కెళ్లింది. డాక్టరుగారు అమ్మను పరీక్షించి నేను బాగా ఆరోగ్యంగా వున్నానని చెప్పారు. నాకు చాలా సంతోషంగా అనిపించింది. అమ్మకు కూడా అంతే.

నవంబర్ 25:

అమ్మ, నాన్న నాకు పేరు పెట్టాలని ఆలోచించారు. కానీ నేను పాపాయినని వాళ్లకు తెలీదుకదా. ఏవేవో పేర్లు ఆలోచించారు. నాకైతే... ఒక పేరంటే చాలా ఇష్టం. అదేంటో తెలుసా! 'ఆమని'. ఆ...అసలు విషయం మర్చేపోయాను. మొదటి కంటే ఇప్పుడు నేను చాలా పెద్దగా అయ్యాను.

డిసెంబర్ 10:

నా వెంట్రుకలు బాగా పెరుగుతున్నాయి. మెత్తగా ...మెరుస్తున్నాయి. నాకు అమ్మ వెంట్రుకలు చూసి భలే ఆశ్చర్యంగా వుంటుంది. తలంటుపోసుకుని ఆరపెట్టుకుంటుంటే... భలే బావుంటాయి. పొడవాటి వెంట్రుకలు గాలికి అటూ ఇటూ అల్లరిగా కదులుతాయి.

డిసెంబర్ 13:


మొన్న వీధిలో కుక్కపిల్ల తన స్కూటరు కింద పడిందని నాన్న ఎంత బాధపడ్డారు? దాన్ని ఇంటికి తీసుకొచ్చి మరీ కట్టుకట్టి పాలు తాగించి పంపించారు. గుర్తుందా! కనీసం కుక్కపిల్లమీద వున్న జాలి కూడా నామీద నాన్నకు లేదే అమ్మా...తన వల్ల దాని కాలికి దెబ్బ తగిలినందుకే అంత బాధపడ్డారే. మరి తన బిడ్డనైన నన్ను ఎందుకనమ్మా...ఇలా కత్తులతో చంపించాలని చూస్తున్నారు?! నేను రోడ్డుమీద బతికే కుక్కపిల్ల కంటే హీనమైన దాన్నా.

హమ్మయ్య ఇప్పుడు నేను పూర్తిగా చూడగలుగుతున్నాను. కాకపోతే... నా చుట్టూ అంతా చీకటిగా వుంది. నన్ను అమ్మ కొత్త ప్రపంచంలోకి తీసుకొచ్చినప్పుడు అంతా వెలుతురే! ఎన్ని రంగులో...ఎన్ని వింతలో... ఎన్ని అద్భుతాలో... గాలి... వాన... ఎండ... పూలు... మంచు... చెట్లు... కాయలు... చెరువులు... కాలువలు... సముద్రాలు... చేపలు.. కప్పలు... సీతాకోకచిలుకలు... చిలుకలు... పావురాళ్లు... రంగులు... నేస్తాలు.. ఆటలు.. పాటలు... ఇంకా చెప్పాలంటే చాలా వున్నాయిలే...అవన్నీ నేను చూస్తాను. వీటన్నిటికంటే ముఖ్యంగా...నేను ముందుగా అమ్మను చూస్తాను. అదే నాకు చాలా చాలా ఇష్టం.

డిసెంబర్ 24:

నా గుండె చప్పుడు అమ్మ వినగలుగుతుందా! అసలు ఆ విషయం తల్చుకుంటేనే చాలా ఆశ్చర్యంగా వుంటుంది నాకు. నా గుండె టప్ ..టప్..టప్..టప్..అని కొట్టుకుంటోంది. వింటుంటే...ఒక్కోసారి నాకు నవ్వొస్తుంది కూడా.

డిసెంబర్ 28:

ఈ రోజు నేను అమ్మతో కలిసి హాస్పిటల్‌కి వెళ్లాను. అక్కడ ఒక యంత్రం వుంది. అది నాకైతే రాక్షసి లాగా కనిపించింది. ఎందుకంటే అందులోంచి చూస్తేనే నేను పాపాయినని తెలిసింది. అంతే అంతా ఒక్కసారిగా నీరసపడిపోయారు.

డిసెంబర్ 29:

మనింటికి వచ్చిన చుట్టాలు అన్న మాటలు వింటే నాకు చాలా బాధగా వుందమ్మా...కొంతమందేమో! 'నెక్స్ట్ టైమ్ బెటర్ లక్' అన్నారు. అంటే నేను పుట్టడం బ్యాడా అమ్మా. అబ్బాయి పుడితేనే గుడ్డా! ఇంకొందరేమో! ఏదో జరగరానిది జరిగిపోయినట్టు... చాలా బాధగా... నీరసంగా... 'ఏం చేద్దాం. ఈసారికి తీయించుకుంటే సరి. వెయ్యి రూపాయలతోటే వదిలిపోతుంది శని. ఈ ఖర్చు చూసుకుంటే...ఇక జీవితాంతం దీన్ని భరించాల్సిందే...ఈ కళ్లతో ఎన్ని చూడలేదు...' అంటూ ఒకటే నూరిపోశారు. ఇంక తాతయ్యకైతే నేను పుట్టడమే ఇష్టం లేదు. వాళ్ల ఆస్తంతా ఎటో వెళ్లిపోతుందంట. అదే అబ్బాయి పుడితే ఆస్తి అంతా కుటుంబంలోనే వుంటుందంట. పైగా వచ్చే అమ్మాయి తెచ్చే ఆస్తికూడా కలిసి పెరుగుతుందంట. నానమ్మకైతే అబ్బాయిలంటేనే చాలా ఇష్టం. ఎందుకంటే పున్నామ నరకం నుంచి కాపాడేది అబ్బాయిలేనంట. తన కొడుక్కి ఆ నరకం నుంచి కాపాడే కొడుకు కావాలని వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంది. కానీ నేను అమ్మ కడుపున పడ్డానని తెలిసిన దగ్గరనుంచి ఒకటేమని బాధపడింది. నానమ్మ ఇవాళ మాత్రం చాలా సంతోషంగా వుంది. మరి నన్ను వదిలించుకోవడానికి హాస్పిటల్‌కి తీసుకెళుతున్నారుగా.

కానీ అమ్మా... నాన్నా... నానమ్మా... తాతయ్యా... అమ్మమ్మా..ఇంకో తాతయ్యా... అందరూ నా మాట వినరూ! నా గుండె ఏం కోరుకుంటుందో వినరూ! నన్ను ఇలా పిండంగానే చంపేయకండి. నాకు పాపాయిగా అమ్మ చేతుల్లోకి రావాలని వుంది. నేను పుట్టి పెరిగాక మీ అందరికీ సంతోషాన్నే ఇస్తానమ్మా. మంచి పేరు తెచ్చిపెడతానమ్మా. మీరు ఇప్పుడు నా చెయ్యి పట్టుకుని నడిపిస్తే... నేనేమో మీరు ముసలివాళ్లయ్యాక మీ రెండు చేతులు పట్టుకుని నడిపిస్తానమ్మా. చిన్నప్పుడు మీరు నాకు ఇచ్చిన ప్రేమకంటే చాలా చాలా ఎక్కువ ప్రేమను తర్వాత మీకు అందిస్తానమ్మా... అమ్మా! నువ్వు చెప్పు. నీ మనసులో ఏముందో! నాకు తెలుసు. తల్లికి ఆడపిల్లయినా... మగపిల్లాడయినా ఒకటేనని. నన్ను హాస్పటల్‌లో చంపేస్తారని తెలిసిన దగ్గర నుంచి నువ్వు ఎంత బాధపడుతున్నావో నాకు తెల్సమ్మా...రాత్రుళ్లు నాకోసం ఏడ్చీ ఏడ్చీ... అలా నిద్రపోయినప్పుడు నేను ఎంతో బాధపడేదాన్నమ్మా. నామీద నీకు వున్న ప్రేమలో మిగతావారికి ఆవగింజంత వున్నా... నన్ను ఇవాళ ఇలా ఆస్పత్రి మంచంమీద పండబెట్టేవాళ్లే కాదు.

ఇప్పుడు నాకు వున్న ఒకే ఒక్క ఆశ... ఆధారం... నువ్వేనమ్మా... నువ్వు తల్చుకుంటే... నన్ను ఈ భూమి మీదకు తేవచ్చమ్మా! కాదంటావా అమ్మా! ఇది వరకు... అంటే... అమ్మమ్మలు... వాళ్ల అమ్మమ్మలు... వాళ్ల అమ్మమ్మలు పుట్టకముందు... ఇలా ఈ ఆపరేషన్లు...చేసి నాలాంటి ఆడపిల్లల్ని చంపడం ఇంకా రాలేదు. కనీసం అప్పుడు ఆడపిల్ల తల్లి బొజ్జలో తొమ్మిది నెలలు పెరిగి... భూమి మీద పడేవరకైనా ఆగేవారు. అప్పుడు నోట్లో ఏ వడ్లగింజో వేసి చంపేసేవారు. లేకపోతే ఊపిరి ఆడకుండా చేసి చంపేసేవారు. లేకపోతే...గుడ్డల్లో చుట్టి ఏ కుప్ప తొట్లోనో కాలువలోనో వేసేవాళ్లు. నీచు వాసనకు పందులో, కుక్కలో వచ్చి నోట కరుచుకుని వెళ్లి పాపాయిలను కొరికి కొరికి చంపి పారేసేవి. ఆతర్వాత చీమలు పట్టి ఆగం చేసేవి. అంతటి దయనీయమైన చావు చచ్చినా... కనీసం ఆ కొద్ది గంటలైనా అమ్మ దగ్గర వుండే అవకాశం అప్పటి పాపాయిలకు దక్కేది. ఆ అపురూపమైన క్షణాలను తల్చుకుంటూ వాళ్లు కుక్కలు కరుస్తున్నా...పందులు కొరుకుతున్నా... కొద్దిపాటి సంతోషాన్ని తమతో తీసుకెళ్లేవారు. కానీ ఇప్పుడో... అదేం లేదు. మూడో నెల పిండంగా వుండగానే...నా లాంటి పాపాయిలను కత్తులు, కటార్లతో బయటకు తీసేస్తున్నారు. కాలువల్లో పడేస్తున్నారు. కనీసం కొద్ది క్షణాల పాటుకూడా అమ్మ స్పర్శ తెలియకుండానే ఆసుపత్రి డస్ట్‌బిన్‌లోకి ... అక్కడి నుంచి వీధుల్లో వున్న డస్ట్‌బిన్‌లోకి వెళ్లిపోతున్నాం.

అమ్మా! నాకు కూడా పుట్టాలని వుందమ్మా... నీ స్పర్శను తనివితీరా పొందాలని వుందమ్మా...నాకు నువ్వు కావాలమ్మా... నీ ముద్దు మురిపాలు కావాలమ్మా... నీ చేతి గోరుముద్దలు తినాలని వుందమ్మా... ప్రేమగా నువ్వు చెప్పే మాటలు, కథలు వినాలని వుందమ్మా... నీ ఆటపాటల్లో నన్ను నేను మర్చిపోవాలని వుందమ్మా...నీ ప్రేమలో తడిచిపోవాలని వుందమ్మా...నాకు ఆ ఒక్క అవకాశం ఇవ్వమ్మా. ప్లీజ్ అమ్మా... నా మాటలు వినిపిస్తున్నాయా అమ్మా.

మొన్న వీధిలో కుక్కపిల్ల తన స్కూటరు కింద పడిందని నాన్న ఎంత బాధపడ్డారు? దాన్ని ఇంటికి తీసుకొచ్చి మరీ కట్టుకట్టి పాలు తాగించి పంపించారు. గుర్తుందా! కనీసం కుక్కపిల్లమీద వున్న జాలి కూడా నామీద నాన్నకు లేదే అమ్మా...తన వల్ల దాని కాలికి దెబ్బ తగిలినందుకే అంత బాధపడ్డారే. మరి తన బిడ్డనైన నన్ను ఎందుకనమ్మా...ఇలా కత్తులతో చంపించాలని చూస్తున్నారు?! నేను రోడ్డుమీద బతికే కుక్కపిల్ల కంటే హీనమైన దాన్నా.

అమ్మా... అన్నట్టు నాకు ఒక విషయం గుర్తొచ్చింది. మొన్న ఎర్ర గేదెకు పెయ్యిదూడ పుట్టాలని నానమ్మ ఎన్ని దేవుళ్లకు మొక్కుకుంది?! కోడెదూడ పుట్టకూడదని ఎన్ని దేవతలను ప్రార్థించింది?! కానీ నీ దగ్గరకొచ్చేసరికి అలా ఎందుకుచేస్తోందమ్మా? పాపాయి వద్దంటోందేంటి? కనీసం పశువు మీదున్న ప్రేమ కూడా నామీద లేదా అమ్మా.

అమ్మా...ఈ ప్రపంచంలో నన్ను కాపాడగలిగేది నువ్వు ఒక్కదానివే. నీ ఒక్కదానివల్లే అవుతుంది. అమ్మా...కాస్త ధైర్యం తెచ్చుకోమ్మా...నోరు తెరిచి వాళ్లందరికి సమాధానం చెప్పమ్మా.. నామీద నీమనసులో వున్న ప్రేమను చెప్పమ్మా... అమ్మాయైనా... అబ్బాయైనా ఒకటేనని వాళ్లకు అర్థం అయ్యేలా చెప్పమ్మా... నువ్వు చక్కగా మాట్లాడతావని నాన్న నిన్ను ఎన్నిసార్లు మెచ్చుకోలేదు. ఆ మాటలు ఇప్పుడు ఉపయోగించమ్మా...అందరికీ నామీద ప్రేమ...జాలి...కలిగేలా చెయ్యమ్మా... అమ్మా...ఒక్కసారి...ఒక్కటంటే...ఒక్కసారి నా కోసం వాళ్లందరినీ ఎదిరించలేవా అమ్మా... అమ్మా...ఇప్పటికైనా మాట్లాడమ్మా... డాక్టర్‌గారు నన్ను చంపడానికి రెడీ అవుతున్నారమ్మా...

అమ్మా! తొందరగా ఏదో ఒకటి నిర్ణయించుకోమ్మా...డాక్టరుగారు అంతా రెడీ అయ్యి వచ్చేస్తున్నారమ్మా...అమ్మా...ఇది నా ఆశ... కోరిక... ప్రార్థన... వేదన.... ఏదైనా అనుకోమ్మా... నన్ను బ్రతికించుకోమ్మా... నన్ను పుట్టనివ్వమ్మా... అదిగో వచ్చేశారమ్మా... మత్తుడాక్టరుగారు కూడా వచేశారమ్మా... అమ్మా...ఆయన నీకు మత్తు ఇంజక్షను ఇచ్చేస్తే... ఇంక నేను ఏం చెప్పినా అస్సలు వినిపించదమ్మా...అమ్మా...ప్లీజ్ అమ్మా...ప్లీజ్ అమ్మా... ఈ ఒక్కమాట వినమ్మా...నన్ను బ్రతికించుకోమ్మా... ఒక్క మాట చెప్పమ్మా వాళ్లకు...అమ్మా డాక్టరు గారు ఇంజక్షన్ చేస్తున్నారమ్మా... ఇదే నా చివరి మాట అమ్మా...నాకు బ్రతకాలని వుందమ్మా...నీ పాపాయిగా పుట్టాలని వుందమ్మా... అయినా అమ్మా ఇంకా ఈ భూమి మీద పడని పాపాయికి హక్కులేం వుండవా అమ్మా... వాటిని కాపాడాల్సింది నీవే కదా అమ్మా... అమ్మా...ఇవే నేను నీకు చెప్తున్న చివరి మాటలు అమ్మా...అమ్మా...!!

కథా నిలయం
శ్రీకాకుళం

పియానో సొనాటాల స్వరశిల్పి బిథోవిన్

డా॥ జె.పి.వైద్య

'మొజార్ట్ చిన్నతనంలోనే సంగీత ప్రతిభతో బాగా సంపాదించాడు. మనవాడూ అలాగే సంపాదించాలి' అనే సంకుచిత స్వార్థంతో తండ్రి ప్రవర్తించే వాడు. బలవంతంగా నిర్బంధించి మరీ గంటల కొద్దీ పియానో వాయించమని తిప్పలు పట్టేవాడు. నిద్రలోంచి లేపి మరీ క్రూరంగా హింసించేవాడు. నిద్రమత్తులో పొరపాట్లు దొర్లేవి. తండ్రి పిడిగుద్దులు తనయుడి వీపు మీద సంగీతం సృషించేవి. ఎన్ని తన్నులు తిన్నా 'బిథోవిన్' ఓర్పుగా నైపుణ్యంగా వాయించేవాడు. బిథోవిన్ మహా సున్నిత మనస్కుడు, బిడియపడే రకం. పైగా 'అందం' లేనివాడు అందుకే 'ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్' బాగా నాటుకుంది ఆయనలో. ఆటల్లేవు. స్నేహితులు లేరు... మమకారం అందించే తల్లి అస్తమానం అనారోగ్యంతో తల్లడిల్లిపోతూ ఉండేది. ఆవిడ తొందరగానే అసువులు బాయటం 'బిథోవిన్' చేసుకున్న దురదృష్టం. పియానో ముందు చేతులు నొప్పిపెట్టే దాకా రకరకాల శృతులు అద్భుతంగా వాయించే బిథోవిన్ చాలా చిన్న వయస్సులోనే - అంటే ఎనిమిదేళ్ళ చిరుప్రాయంలో తొలి సంగీతం ప్రదర్శన ఇచ్చాడు.

తెరచూ పాశ్చాత్య బాణీలూ, రాగదారీ భారీ సంగీతం ముచ్చట్లు సాగినప్పుడు కొంత మంది "సీరియస్" మొహాలు ఇంకా సీరియస్‌గా పెట్టి 'హుఁ! బిథోవిన్ గురించి తెలీదా?' లాంటి ప్రశ్నలు సంధిస్తుంటారు.

రఫీ, ముకేష్, కిషోర్, మన్నాడేల స్వరలహరుల్లో కరిగిపోయిన దీవానాగాళ్లం మనం. లతా, ఆశా, ముబారక్ బేగమ్‌ల గానంలో మనల్ని మనం మరచిపోయిన వాళ్ళం మనం. ఘంటసాల, బాలూ గాత్రంతో పులకించిపోయిన వాళ్ళం మనం. సుశీల, లీల, జిక్కి, సంగీత జాదూలో 'కొట్టుకుపోయిన వాళ్ళం' మనం.

అయినా, మనకు ఈ బిథోవిన్, మొజార్ట్‌లు తొందరగా తలకెక్కి చావరు కదా! అందుకే కొంత వెరైటీగా ఉంటుందని, పాశ్చాత్య సంగీతం పోకడలను గురించీ అప్పుడప్పుడూ చర్చించుకుందామనే ఈ పాట్లూ, తపనా, ప్రయత్నం! ఆయన అసలు సిసలు పూర్తి పేరు 'లుడ్విగ్ వాన్ బిథోవిన్' (16-12-1770-26.3.1827)

బిథోవిన్, జర్మన్ మహాకవి 'గోథే' సమకాలికులు. బిథోవిన్ మాటల్లో కరుకుతనం, పొగరు, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా ఒక చిన్న సంఘటన వివరిస్తాను.

"ఒకరోజు బిథోవిన్, జర్మన్ మహాకవి 'గోథే' కలిసి వియన్నాలోని వీధిలో ముచ్చట్లాడుకుంటూ వెళ్తున్నారు. ఎదురుగా ఆస్ట్రియా రాణి సపరివారంతో వస్తున్నది. అలనాడు రాజులైనా, రాణులైనా 'వారు వెడలిరి రవి తేజములలరరగ' బాపతే! గోథే వినయంగా తలవంచి పక్కకు తప్పుకున్నాడు మర్యాదగా.

బిథోవిన్ తల బిరుసుగా నడి రోడ్డులో నిలబడి

-"ఆగు! ఎక్కడున్నావో అక్కడే ఆగిపో! మనం పక్కకు తొలగిపోయి వాళ్ళకు దారి ఇవ్వడం ఏమిటీ? వాళ్ళు మనకు దారి ఇవ్వాలి కానీ!' అన్నాడు తీక్షణంగా!"

అది పొగరా! తల బిరుసుతనమా! ఒళ్ళు మంటా! తిక్క రోగమా! ఏదీ కాదు. సంగీతం ఆయనకు అలనాడే అంతటి గౌరవాభిమానాలను అందించింది.

రైన్ నదీ తీరంలోని 'బాన్' నగరం బిథోవిన్ జన్మస్థలం. బాల్యం దుర్భరంగా సాగింది. తండ్రి 'జోహాన్' సాటిలేని మేటి 'దేవదాసు'. బాన్ నగరంలోని ప్రతిష్టాత్మక, 'ఎలక్ట్రోరల్ ఛాపెల్'లో గాయకుడు. చిన్నతనం నుంచి బిథోవిన్ సంగీత సరిగమలతో దోస్తీ చేశాడు.

(పాశ్చాత్య సంగీతంలో ట్రియోస్ (త్రికాలు)- పియానో 'సొనాటా'లూ, అడెబిడ్స్‌లూ ఉంటాయి. అవన్నీ మన స్వరాల్లోని సరిగమల్లాంటివి)

'మొజార్ట్ చిన్నతనంలోనే సంగీత ప్రతిభతో బాగా సంపాదించాడు. మనవాడూ అలాగే సంపాదించాలి' అనే సంకుచిత స్వార్థంతో తండ్రి ప్రవర్తించే వాడు. బలవంతంగా నిర్బంధించి మరీ గంటల కొద్దీ పియానో వాయించమని తిప్పలు పట్టేవాడు. నిద్రలోంచి లేపి మరీ క్రూరంగా హింసించేవాడు. నిద్రమత్తులో పొరపాట్లు దొర్లేవి. తండ్రి పిడిగుద్దులు తనయుడి వీపు మీద సంగీతం సృషించేవి. ఎన్ని తన్నులు తిన్నా 'బిథోవిన్' ఓర్పుగా నైపుణ్యంగా వాయించేవాడు. బిథోవిన్ మహా సున్నిత మనస్కుడు, బిడియపడే రకం. పైగా 'అందం' లేనివాడు అందుకే 'ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్' బాగా నాటుకుంది ఆయనలో.

ఆటల్లేవు. స్నేహితులు లేరు... మమకారం అందించే తల్లి అస్తమానం

అనారోగ్యంతో తల్లడిల్లిపోతూ ఉండేది.

ఆవిడ తొందరగానే చనిపోవటం 'బిథోవిన్' చేసుకున్న దురదృష్టం. పియానో ముందు చేతులు నొప్పిపెట్టే దాకా రకరకాల శృతులు అద్భుతంగా వాయించే బిథోవిన్ చాలా చిన్న వయస్సులోనే - అంటే ఎనిమిదేళ్ళ చిరుప్రాయంలో తొలి సంగీతం ప్రదర్శన ఇచ్చాడు.

ఆస్థాన ఆర్గనిస్ట్ 'క్రిస్టియన్ గోట్‌లాబ్ నిఫే' బిథోవిన్‌లో మొగ్గ తొడుగుతున్న ప్రతిభను వెలికి తీశాడు. ఎంతో ప్రోత్సహించాడు. తర్ఫీదు ఇచ్చి చక్కటి మార్గ దర్శకుడయ్యాడు. 'గురువును మించిన శిష్యుడి'లా ఎదుగుతాడనీ, రెండో మొజార్ట్ కూడా అయిపోతాడని అనుకునేంతగా ఎదిగాడు బిథోవిన్.

'మొజార్ట్' ఆ రోజుల్లో పాశ్చాత్య సంగీతం దునియాలోని 'భీష్మాచార్యుల వారు'. ఆయన దగ్గర సంగీతం వినిపించి మెప్పు పొందాలని బిథోవిన్ కోరిక.

అందుకే వియన్నా వెళ్ళి మొజార్ట్‌కు సంగీతం విన్పించాడు.

మనస్సూ, ఆత్మ ఏకం చేసుకొని ఎంతో ఓపికతో రకరకాల సొనాటాలు విన్పించాడు. కొత్త స్వరకల్పనలు కూడా ప్రదర్శించాడు. మౌనంగా అన్నీ విన్న మొజార్ట్ పెదాలపై చిన్న చిరునవ్వును వెలిగేలా చేసింది బిథోవిన్ సంగీతం ఎట్టకేలకు.

'నువ్వు ఒక రోజు సంగీత సముద్రంలో ప్రపంచాన్ని ముంచేస్తావు' అని మెచ్చుకున్నాడు.

క్షయవ్యాధితో తల్లి మరణించడం 'బిథోవిన్'ను కృంగదీసింది. కాని, సంగీతం పట్ల మమకారం, ఇంకా సాధించాలీ అనే తపన పెరిగింది. తండ్రిగారి తాగుడు మితిమీరిపోయింది. చర్చి ఉద్యోగం వూడిపోయింది. కుటుంబ పోషణ కాస్త బిథోవిన్ తల మీద భారంలా మారింది.

బిథోవిన్ కుటుంబాన్ని పోషించడానికి తిప్పలు పడ్డాడు. నాటక రంగంలోని ఆర్కెస్ట్రాల్లో వాద్యగాడిగా అవతారం ఎత్తాడు. సంగీతం ట్యూషన్లు చెప్పాడు. పియానో ప్రదర్శన లిచ్చాడు. అంతటితో ఆగకుండా కొత్త కొత్త పియానో సంగీత స్వరాలను సృష్టించాడు. 'బాన్' నగరంలో క్రమక్రమంగా బిథోవిన్ పేరు మారుమోగిపోయింది. సంపన్నులు ఆయనతో దోస్తీ చేద్దామని ముందుకు రావడం మొదలైంది.

ధనసాయం చేసి ఆదుకునే "బ్రూనింగ్"-"కౌంట్‌వాల్డ్ స్టెయిన్' లాంటి మిత్రులు లభించారు.

వియన్నాలో సంగీత రసికులు కూడా 'బిథోవిన్' సంగీతం గురించి చర్చించడం మొదలు పెట్టారు. జోసఫ్ హైడన్ లాంటి ఆనాటి సుప్రసిద్ధ సంగీతజ్ఞులు కూడా బిథోవిన్ సంగీతం వైపు చెవులు సారించడం ప్రారంభించారు. పెద్ద నగరాల్లోని 'పోకడ జీవితం' - 'స్టైలిష్ హంగులూ' నాగరిక జీవితాన్ని అంతగా పట్టించుకోని బిథోవిన్ జీవిన పద్ధతులనూ మార్చివేశాయి.

వస్త్రధారణతోపాటు సంగీత సృజన కూడా మార్పులతో అలరించ సాగింది.

మొరటుగా, కాస్తంత నిర్లక్ష్యంగా మెదిలే బిథోవిన్ స్టైలు మారింది. తల మీద విగ్గులూ, సిల్కు చొక్కాలూ, ఫ్యాషనబుల్ సూట్లూ, అందమైన నోట్లూ చెంత చేరాయి. సంగీతం సొంపుగా రాణించింది. బిథోవిన్ అందగాడు కాదు. పొట్టిగా, గుమ్మటంలా, మొద్దుగా కన్పించేవాడు. తల సింహం తల కాయలా బలంగా కొట్టొచ్చినట్టు కన్పించేది. పైగా మొహం నిండా స్ఫోటకపు మచ్చలు. బలమైన ప్లస్ పాయింట్ స్వర్గ సీమకు తీసుకెళ్ళే అద్భుతమైన సంగీతమే! హైడెన్ శిష్యరికంలో 'మజా' రాక అతడు కొత్త గురువులను వెతుక్కోసాగాడు. అర్బర్ట్స్ బెరగ్గర్, కాపెల్ మీస్టర్ లాంటి గురువులనూ మించిపోయాడు బిథోవిన్.

మెల్ల మెల్లగా రాజప్రాసాదం ద్వారాలు బిథోవిన్ కోసం సగౌరవంగా తెరుచుకున్నాయి. రాజకుమారుడు లిచ్‌నోవ్‌స్కీ, లోబ్‌నో విట్జ్ ఏకంగా అతడిని రాజప్రసాదంలోనే బస చేయమని కోరారు. ఉన్నత వర్గాల సంగీతాభిరుచుల ఔన్నత్యం పెంపొందేలా అద్భుతంగా ఎదిగిపోయింది బిథోవిన్ సంగీతం.

మొజార్ట్, హైడెన్ మార్గాల్లో సంగీత స్వరకల్పనలు సాగినా, బిథోవిన్ మధుర స్వరసంగతులు, వాటి ప్రత్యేక ముద్ర అంతటా కొట్టొచ్చినట్టు కన్పించేది.

ఒక ఉన్నత స్థానానికి చేరుకున్న తర్వాత కాస్తంత 'తల బిరుసుతనం' కూడా ఒంటపట్టుందో ఏమో మరి!

సంగీత మందిరంలో మైమరచి సంగీతం విన్పిస్తున్న బిథోవిన్‌కు ముందు వరుసలో తన దునియాలో తానున్న చందాన ముచ్చట్లు పెట్టుకుంటున్న ఉన్నత వర్గం తాలూకు రాజు ప్రముఖులు కన్పించారు. ఒళ్ళు మండి పియానో వాయించటం ఆపి, చేతులతో గట్టిగా చరుస్తూ - 'ఇలాంటి పందుల ముందు నేను సంగీతం విన్పంచను కాక విన్పంచను' అని గట్టిగా అరిచాడు. అది బిథోవిన్‌కు మాత్రమే సాధ్యం. 'పందులు' అని సభాముఖంగా దులిపేసినా- సదరు పెద్దోళ్ళు తల వంచుకున్నారు తప్ప 'ఆఁయ్!' అని పైకెరగలేదు. 'ఆరేద్! చుప్!!' అని కాలర్ పట్టుకోనూలేదు.

వియన్నా నగరాన్ని 'సంగీతపు నియంతలా' పరిపాలించాడు బిథోవిన్.

'పియానో వాద్యకారుల్లో విశ్వరూపం దాల్చిన అసమాన సంగీత కారుడు' అని జనం



నెత్తిమీద పెట్టుకొని ఊరేగేలా చేశాడాయన.

అది 18వ శతాబ్దం. ఆయన సంగీత రచనలు, 'సెపెట్'-'ఫస్ట్ సింఫనీ' సంగీత ప్రపంచంలో మాస్టర్ పీస్‌లు. 'వాల్డ్ స్టేన్' -'అప్పాస్సియోనాటా'-'మూన్ లైట్ సొనాటా' పియానోల ప్రత్యేకతలైతే, 'ఎరోయికా సింఫనీ'-'క్రూజర్ సోనాటా'లు వయోలిన్, పియానోల సమిశ్రమ అందాల ప్రతీకలుగా నేటికీ అద్వితీయాలు.

ఇంతటి (అనాకారి) సంగీతకారుడూ, సంగీత రచయితకూ ప్రేమపాశం తప్పలేదు. కాని, అన్నీ అందని ద్రాక్షపళ్ళే పాపం!

'గులియెటా గుస్తియార్డి'కి ఆయన 'మూన్‌లైట్ సొనాటా'ను అంకితం చేశాడు. బంధువైన 'థెరిసీ మల్ ఫట్టీ' కి 'అప్పాసియోనాటా' అందించాడు. ఆవిడే దానికి ప్రేరణ అని చెప్తారు. ముచ్చటగా మూడో ఆవిడ 'థెరిసీ మల ఫట్టీ'- నాలుగో సుందరి 'బెట్టినా బ్రెంటానో'- ఆ అమరస్త్రీలు, అనురాగ మూర్తులూ సంగీతాన్నే గ్రోలిన 'అందని ద్రాక్షపళ్ళు'.

ఆఖరు రోజుల్లో చెవిటివాడై పోయినా తన సంగీతంతో శ్రోతల కంట తడి పెట్టించగల్గిన అమర సంగీతాన్ని సృష్టించిన బిథోవిన్ 'ఒంట్లో నీరు చేరి' రకరకాల తిప్పలు పడి జీవితం చాలించాడు.

బాన్ నగరంలోని '20- బాన్‌గాస్' నేటికీ సంగీత ప్రియులకు తీర్థస్థానం- నేటికీ అక్కడి 'పియానో'ను తాకి పరవశులవ్వాలని కోరుకుంటారు 'సంగీతం దీవానా'లు.

మనం అలాంటి దీవానాలమే! 'జాన్'కూ-'బాన్‌గాస్'కూ వెళ్ళలేమేమో కాని, మన సంగీతకారులనూ, హీరోలనూ ముఖ్యంగా హీరోయిన్‌లను తిప్పలు పెట్టే వీరాధి వీరులం. శూరాధిశూరులం! వాళ్ళెవరూ అందుబాటులో లేనప్పుడు పోస్టర్లనుసైతం ప్రేమించే రసికోత్తములు మనలో లేరా?

✻

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.

ఫోన్ : 08732223622

ఎస్. వెంకట్రావు



సిపిఐ(ఎం) - పర్యావరణం

పర్యావరణ సమస్య కమ్యూనిస్టుల ఎజెండాలో ఎల్లప్పుడూ ఒక ముఖ్యమైన విషయంగానే వుంటోంది. ఎందుకంటే పర్యావరణ సమస్య చుట్టూ అనేక ప్రజా సమస్యలు అల్లుకుని ఉన్నాయి కనుక. పర్యావరణ సమస్య వెనుక అంతర్జాతీయ సమస్యలున్నాయి, జాతీయ సమస్యలున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే ప్రపంచ సహజవనరులను కొల్లగొట్టే సామ్రాజ్యవాద విధానాలు, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వల్ల వాతావరణ కాలుష్యాలు పెరుగుతున్నాయి. ఫలితంగా భూగోళం వేడెక్కి ప్రపంచం నలుచెరగులా అనేక రకాలైన అనర్థాలు సంభవిస్తున్నాయి.

అతివృష్టులు, అనావృష్టులు, వరదలు, దుర్భిక్షాలతో ప్రపంచం తల్లడిల్లుతోంది. జాతీయంగా చూస్తే బహుళజాతి గుత్త సంస్థలు, దేశీయ కార్పొరేట్ సంస్థలు ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్నందున అడవులు నాశనమవుతున్నాయి. గిరిజనులు, పేద ప్రజలు లక్షల సంఖ్యలో నిరాశ్రయులవుతున్నారు. దేశంలో ధనికులు అమెరికా తరహా వినియోగ తత్వానికి అలవాటుపడడం వల్ల మన పర్యావరణం మరింత దెబ్బతింటోంది.

ఈ పర్యావరణ సమస్యలు ఇప్పుడు పెరిగి పెద్దవై మొత్తం మానవాళి మనుగడకే ప్రమాదంగా మారాయి. అందులోనూ ఎక్కువగా నష్టపోతున్నదీ, మొదటి దెబ్బ తింటున్నదీ పేద, సామాన్య ప్రజలే. అందువల్ల ప్రజల హక్కుల కోసం నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీ సహజంగానే ఈ సమస్యలను చేపడుతుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మూడేళ్ల కొకసారి జరుపుకునే మహా సభల్లో ఆమోదించే రాజకీయ నివేదికలో ఇతర అనేక ప్రజా సమస్యలతో పాటు పర్యావరణ సమస్యలు కూడా చోటు చేసుకుంటాయి. అయితే ఈసారి తమిళనాడులోని కోయంబత్తూరులో జరుగుతున్న పార్టీ అఖిల భారత మహాసభలో ప్రవేశపెడుతున్న ముసాయిదా నివేదికకు పర్యావరణ సమస్య రీత్యా ఒక ప్రత్యేకత ఉంది. ఈ నివేదికలో పర్యావరణ సమస్యకు అత్యధిక ప్రాధాన్యత నీయడమే ఈ ప్రత్యేకత. నివేదికలోని అంతర్జాతీయ, జాతీయ సమస్యలు రెంటిలోనూ పర్యావరణ సమస్యల్లను గురించి చర్చించారు. అంతర్జాతీయ పరిస్థితులు వివరించే భాగంలో 'వాతావరణ మార్పుల సవాలు' అనే శీర్షిక కింద మూడు పేరాల్లో ఈ సమస్యను కూలంకషంగా చర్చించారు. జాతీయ పరిస్థితులు వివరించేటప్పుడు కూడా నాలుగు పేరాల్లో పర్యావరణ సమస్యలను చర్చించారు. ఒక కమ్యూనిస్టు పార్టీ మహాసభలో పర్యావరణం గురించి ఇంత విపులంగా చర్చించడం బహుశా మన దేశంలో ఇదే ప్రథమం కావచ్చు. ఉదాహరణకు, పార్టీ గత మహా సభ నివేదికలో జాతీయ పరిస్థితుల్లో ఒక్క పేరాలో మాత్రమే ఈ అంశాన్ని గురించి చర్చించారు.

భారత దేశంలో విప్లవకర కమ్యూనిస్టు పార్టీ అయిన మార్క్సిస్టు పార్టీ పర్యావరణ సమస్య గురించి ఏం చెప్పిందో తెలుసుకోవడం ఈ భూగోళంమీద మానవాళి మనుగడ సవ్యంగా ఉండాలని కోరుకునే అందరికీ అవసరం. పార్టీ 19వ మహాసభ రాజకీయ తీర్మానం ముసాయిదాలోని అంతర్జాతీయ విభాగంలో ఈ విధంగా చెప్పింది:

(1.22) భూగోళం వేడెక్కడం లేదా వాతావరణ మార్పుల సమస్య ఇప్పుడు సంక్షోభ రూపం దాల్చింది. వాతావరణ మార్పులపై అంతర్జాతీయ సంస్థ(ఐపిసిసి) తాజా నివేదిక ప్రకారం చూస్తే గ్రీన్‌హౌస్ వాయువుల అదుపుకు అంతర్జాతీయంగా దృఢ సంకల్పంతో చర్యలు తీసుకోనట్టయితే రానున్న దశాబ్దాలలో విషమ పరిణామాలు సంభవిస్తాయి. ఈ శతాబ్ది చివరకు భూగోళంపై మొత్తం మానవ జాతి జీవనానికే నిజంగా ముప్పు రావచ్చు. స్వల్ప కాలం నుంచి ఒక మోస్తరు కాలం వరకూ గల వ్యవధిలో చూసినా ప్రధానంగా ఇండియా వంటి పేద దేశాలు కోస్తా ప్రాంతాలు ద్వీపాలు కలగలసి పోయి అత్యధిక నష్టానికి గురి కావచ్చు. గోధుమ, వరి పంటల దిగుబడి దారుణంగా పడిపోవచ్చు. అంటువ్యాధులు తీవ్రరూపం దాల్చవచ్చు. వాతావరణ మార్పులపై కేంద్రీకరించిన 2007-08 మానవాభివృద్ధి నివేదిక అనేక దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను వెల్లడించింది. ఇప్పుడున్న ప్రకారమైతే ప్రపంచ ఉష్ణోగ్రత 21వ శతాబ్ది చివరకు 5 డిగ్రీల సెల్సియస్ పెరుగుతుంది. భూగోళంపై జీవరాశి మనుగడకు ముప్పు 2 డిగ్రీల దగ్గరే ప్రమాద సూచిక దాటిపోతుంది. దీన్ని గనక అడ్డుకోకపోయినట్టయితే ప్రపంచంలోని 260 కోట్ల మంది పేదలే అందరికన్నా ఎక్కువగా కష్టాలపాలవుతారు. ఎందుకంటే వారే ప్రపంచ జనాభాలో 40 శాతం పైగా వున్నారు.

(1.23) ప్రపంచ పెట్టుబడిదారీ విధానపు కొల్లగొట్టే స్వభావమే అలాంటి ముప్పు ముంచుకు రావడానికి ప్రధాన కారణంగా వుంది. సంపన్న దేశాలు తమ సంపదలు పెంచుకోవడానికి వర్ధమాన దేశాలపై దోపిడీని తీవ్రం చేశాయి. అంతేగాక అందుకోసం వాతావరణంలో కలుగుతున్న మార్పుల ప్రభావం కూడా వర్ధమాన దేశాలనే అత్యంత ఎక్కువగా నష్టపరుస్తున్నది. వాతావరణ మార్పు వర్షపాతంపైన, ఉష్ణోగ్రతపైన, నీటి లభ్యతపైన ఎక్కువ దుష్ప్రభావం చూపుతున్నది. తత్ఫలితంగా ప్రపంచంలో వ్యవసాయంపై ఆధారపడిన వందల కోట్ల మంది దెబ్బతింటున్నారు. ఇందులో బాగా

నష్టపోయే దేశాలలో ఇండియా ఒకటి. హిమశిఖరాలు కరిగిపోవడం వల్ల నదీ ప్రవాహాలు క్షీణించి వందల కోట్ల మంది జీవితాలపై ప్రభావం పడుతున్నది. ముఖ్యంగా హిమాలయాల్లో హిమానీ నదాలు హరించుకుపోవడం మొత్తం దక్షిణాసియాను నష్టపరుస్తుంది. ప్రపంచ ఉష్ణోగ్రత గనక 3 నుంచి 4 డిగ్రీలు పెరిగితే వరదలు సంభవించి లక్షలాది మంది నిరాశ్రయులవుతారు. సముద్రాలు, భూమి వేడెక్కడం వల్ల మన జాతిలో మూడో వంతు నిర్మూలించబడుతుంది. అలాంటి మార్పుల ప్రభావం ఇప్పటికే కనిపిస్తున్నది. 2000 - 2004 మధ్య కాలంలో ఏటా 26.2 కోట్ల మంది వాతావరణ కల్లోలాలకు గురయ్యారు. ఇందులో 98 శాతం వర్ధమాన దేశాల వారే.

(1.24) కాలుష్య కారక దేశాల్లో అమెరికా ముందుంది. ప్రపంచ జనాభాలో అక్కడ 4 శాతం కన్నా తక్కువగా వున్నా కాలుష్యం విడుదలలో 16 శాతానికి కారణమవుతున్నది. అయినా బుష్ హయాంలో క్యోటో ఒప్పందంపై సంతకం చేసేందుకు నిరాకరిస్తూ అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్ని ధిక్కరిస్తున్నది. ఇటీవల జరిగిన బాలి మహాసభ విషవాయు విడుదల తగ్గింపు లక్ష్యాల సాధనలో నిర్ణయాత్మక చర్యలు చేపట్టడంలో విఫలమవడానికి అమెరికా ఆ లక్ష్యాలను నిరాకరించడమే కారణం. ప్రపంచమంతటా గల ప్రగతిశీల శక్తులు ఈ విషయమై తమ ప్రభుత్వాలపైన, అంతర్జాతీయ సంప్రదింపుల వేదికలపైన ఒత్తిడి తేవలసి వుంది. అమెరికా ఇతర అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు విషవాయు నిరోధానికి సంబంధించి గట్టి లక్ష్యాలు నిర్ణయించుకుని అమలు జరిపే విధంగా చూడవలసి వుంది. వాటిని అమలు చేసేందుకు జవాబుదారీ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయవలసి వుంది. వాతావరణ మార్పులకు అనుగుణంగా మనుగడ సాగించేందుకు విషవాయు విడుదలను తగ్గించే సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించుకునేందుకు అవసరమైన నిధులను పారిశ్రామిక దేశాలు వర్ధమాన దేశాలకు సమకూర్చవలసి వుంది. వాటిని ప్రజావరణంలో అందుబాటులో వుంచడం అవసరం.

జాతీయ పరిస్థితులను వివరించే విభాగంలో నాలుగు పేరాలను పార్టీ పర్యావరణ సమస్యల కోసం కేటాయించింది. అవి:

(2.69) భారత దేశంలో పర్యావరణ సమస్యలు తీవ్రమవుతున్నాయి. పలు ప్రాంతాలలో అవి సంక్షోభ దశకు చేరుకుంటున్నాయి. ప్రజలు, ప్రత్యేకించి పేద, బలహీన వర్గాల జీవనోపాధిపైన, జీవన పరిస్థితులపైన, ఆరోగ్యంపైన తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. సరళీకృత, ప్రపంచీకరణ విధానాల వల్ల, ఉమ్మడి వనరులను వాణిజ్యీకరణ చేయడం వలన, బహుళ జాతి సంస్థలు, భారత కార్పొరేట్ సంస్థలు, ఇతర స్వార్థపర శక్తుల వత్తిళ్ల వలన ఈ రంగాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం అవడం వలన ఈ సమస్యలన్నీ మరింత తీవ్రంగా మారుతున్నాయి.

(2.70) పర్యావరణాన్ని, గిరిజనులు-ఇతర సంప్రదాయ అటవీ నివాసుల ప్రయోజనాలను పణంగా పెట్టి విస్తారమైన అటవీ భూములు మైనింగ్‌కు, పరిశ్రమలకు, వాణిజ్యపరమైన ప్లాంటేషన్లకు కేటాయించబడుతున్నాయి. సహజవనరులను విపరీతంగా వెలికి తీయడం వలన, కాలుష్యం వలన, శుద్ధి చేయకుండా పారిశ్రామిక కాలుష్యాన్ని వదిలిపెట్టడం వలన, పట్టణ ప్రాంత సూయేరేజ్ వలన జలవనరులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. పరిశ్రమల కోసం, పట్టణ ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి, బాటిల్డ్ వాటర్ తయారీ కోసం, శీతల పానీయాల తయారీ కోసం అదుపులేకుండా వెలికి తీయడం వలన భూగర్భ జలాలు వట్టిపోతున్నాయి. ఈ పరిణామాల వలన చిన్న రైతులు, పట్టణ ప్రాంత పేదలు తీవ్రంగా దెబ్బతింటున్నారు.

(2.71) విచక్షణా రహితంగా ప్రైవేటు రవాణాను ప్రోత్సహించడం, ప్రజారవాణాను నిర్లక్ష్యం చేయడం ఫలితంగా వాయు కాలుష్యం తీవ్రమౌతున్నది. కాలుష్య కారక పరిశ్రమలను అదుపులేకుండా విస్తరించడానికి అనుమతించడం, ప్రమాదకర విష కాలుష్యాలను శుద్ధి చేయకుండా తరలించడానికి అనుమతించడంతో భారత దేశం, సంపన్న దేశాల వ్యర్థపదార్థాలు కుమ్మరించే ప్రదేశంగా తయారవడం పెద్ద సమస్యగా మారింది. పర్యావరణ పరమైన నియంత్రణలను, అదుపును పటిష్టం చేయడానికి బదులు మార్కెట్ శక్తుల పేరుతోను, జిడిపిని అధికం చేయడం కోసం అనే పేరుతోను ప్రభుత్వం మరింత సడలిస్తున్నది.

(2.72) వాతావరణ మార్పు, గ్రీన్ హౌస్ వాయువులు విషయానికి వస్తే అమెరికాతో పోల్చుకున్నపుడు భారత దేశం దానిలో 20వ వంతు మాత్రమే ఆ వాయువులను విడుదల చేస్తున్న మాట వాస్తవం. కాని ఇదే సమయంలో భారత దేశం లోపల పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య తీవ్ర వ్యత్యాసాన్ని కూడా గమనంలోకి తీసుకోవాలి. భారత దేశంలో కాలుష్య వాయువుల విడుదల స్వల్పంగా ఉందన్న దాన్ని సాకుగా చూపి ఇక్కడ కార్పొరేట్ సంస్థలు పారిశ్రామిక సంస్థలు, సంపన్నులు ఉమ్మడి ప్రయోజనాలను, పేద ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి అధిక ఇంధన వినియోగానికి పాల్పడటానికి, తద్వారా అధిక కాలుష్య వాయువులను విడుదల చేయడాన్ని అనుమతించరాదు. భారత దేశంలో నయా ఉదారవాద విధానాల ప్రకారం మార్కెట్ శక్తుల ద్వారా కాకుండా, తగువిధమైన నియంత్రణల ద్వారా ప్రభుత్వం కాలుష్య వాయువుల విడుదలను అదుపు చేయాలని పార్టీ వత్తిడి చేస్తుంది. పట్టణ ప్రాంతాలకు, గ్రామీణ ప్రాంతాలకు మధ్య, సంపన్నులకు, పేదలకు మధ్య ఇంధన వినియోగంలో వ్యత్యాసాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తక్షణం చర్యలు గైకొనాలి.

మార్క్సిస్టు పార్టీ మహాసభ ఈ పర్యావరణ సమస్యకు ఇంతటి ప్రాధాన్యతనిస్తోందంటే ఈ ప్రమాదం ఏ రూపం దాల్చిందో అర్థం చేసుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణోద్యమంలో మార్క్సిస్టు పార్టీ మార్గదర్శకత్వం మనందరికీ లభించిన వరం. ❋





మనుషుల ప్రవర్తనకు అద్దం పట్టిన కథలు

కథ చెప్పే పద్ధతిని బాగా ఆకళింపు చేసుకున్న రచయితలు చక్కటి కథలు రాయగలరు. ఏ విషయాన్ని తీసుకున్నా అవలీలగా కథా రూపం ఇవ్వగలరు. సరిగ్గా ఈ అంశాలన్నీ కాంతి కిరణం కథలకు వర్తిస్తాయి. రచయిత నిశాపతి కథా రచనా కౌశల్యం ప్రతీ కథలో వ్యక్తమవుతూ ఉంటుంది. సరళమైన తీరులో కథ చెప్పడం వల్ల మొదలు పెట్టిన ప్రతి కథా పూర్తి చేసే వరకూ ఆగం. ఏ కథ తీసుకున్నా ఆసాంతం ఆసక్తిగా సాగుతుంది. రచనలో ఈ లక్షణం చాలా అభినందనీయమైనది. ఇకపోతే కథనం ప్రక్కన పెడితే కథా వస్తువులు కూడా కాస్త భిన్నంగానే ఉంటాయి. భిన్నమైన కథాంశాలలో 'జలవృక్షం' కథ ఒకటి. అంగారక గ్రహానికి వెళ్ళిన ఆస్ట్రోనాట్ దంపతులు అక్కడ కనిపించిన ఒక మొక్కని తీసుకురావడం. ఆ మొక్క ఆక్సిజన్‌కు బదులు హైడ్రోజన్ ను విడుదల చేయడం. ఆ హైడ్రోజన్‌కు వాతావరణంలోని ఆక్సిజన్ కలిసి ఆ చెట్టు నీరు స్రవించడం ఆ నీటితో ప్రపంచంలోని నీటి సమస్య అంతా తీరిపోవడం. ఆ తర్వాత దానివల్ల వాతావరణంలో మార్పులు వచ్చి హానికర పరిణామాలు రావడం. ఇవన్నీ చాలా ఆసక్తిగా సాగి కొసమెరుపుతో కథ ముగుస్తుంది.

దీనికి కాస్త భిన్నమైన కథ 'గోలీ సోడా'. గ్రామీణ జీవితం అనుభవించిన ప్రతీ ఒక్కరికి గోలీసోడా ఆస్వాదించడం అనుభవమే. వృద్ధాప్యం వరకూ గ్రామంలోనే గడిపిన వరలక్ష్మమ్మ తన కొడుకు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో సెటిల్ అవ్వడంతో తనూ కొడుకు వద్ద గడపక తప్పలేదు. రోజూ గోలీసోడా తాగే అలవాటున్న వరలక్ష్మమ్మకు చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర ఒకసారి గోలీసోడా కనపడ్తుంది. అప్పటి నుండి ప్రతీవారం గుడి పేరుతో కుటుంబం అంతటినీ చిక్కడపల్లి తీసుకురావడం. తన గోలీసోడా కోరికను తీర్చుకోవడం కథాంశం. గోలీసోడా చుట్టూ తిరిగే కథ గ్రామాల్లో కూల్‌డ్రింక్స్ వచ్చి గోలీసోడా మాయమవ్వడాన్ని చాలా హృద్యంగా చిత్రించింది.

ఈ కథలు వ్యక్తుల మధ్య అవసరార్థం ఏర్పడే కృత్రిమ సంబంధాలను వ్యాఖ్యానిస్తాయి. కుటుంబాలలో ప్రేమానురాగాలు ఉండాల్సిన ఆవశ్యకతను చాలా సరళంగా చెప్పడానికి ప్రయత్నిస్తాయి. అయితే కథలన్నీ వ్యవస్థలో ఉన్న సంబంధాల పట్ల సంస్కరణ దృష్టితో ఉంటాయి గాని, ఈ మానవ సంబంధాల ఉత్పత్తి అయిన సామాజిక వ్యవస్థను లోతుగా చూస్తున్నట్లు అనిపించదు. రచయితకు సైన్స్ అంశాల పట్ల అవగాహన ఉన్నట్లు కొన్ని కథలు తెలుపుతాయి. రోజువారీ సంబంధాలలో మనుషులు పారదర్శకంగా వ్యవహరించక పోవడాన్ని, అపోహలతో జీవించడాన్ని ఈ కథలలో తిరస్కరించడం కనపడుతుంది. కాంతికిరణం, తిరిగిరాని వసంతం, పద్మవ్యూహం, నేతి గిన్నె వంటి కథలు తప్పక చదవాల్సినవి. ఇక కథలు చదవడం ప్రారంభిస్తే ఏ కథా వదలం. చక్కటి శైలి, సంప్రదాయమూ, ఆధునికతా భావాల మేళవింపుల కథా సంకలనం 'కాంతి కిరణం'.

కాంతి కిరణం కథా సంకలనం, రచయిత: నిశాపతి, పేజీలు: 150 వెల: 100/-, పుస్తకాలు దొరుకుచోటు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ పుస్తకాల షాపులు.

- వీరప్రసాద్

చక్కటి చారిత్రక సమాచారం

భారతదేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని సముపార్జించడంలో అనేకమంది త్యాగం ఉంది. తెరమీదకొచ్చిన ఏ ఒక్కరిదో, ఇద్దరిదో కాదు. తెర వెనుక ఉద్యమకారులకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్కరి సంకల్పం ఉంది. దాచేస్తే దాగని సత్యాలు ఏనాటికైనా వెలికి తీయబడతాయి. ఆ పనిని ఎవరో ఒకరు నిరంతరం నిస్వార్థంగా చేస్తూనే ఉంటారు. ఆ కోవకి చెందిన వారే ముబార్కపురం వీరయ్య. వీరి కృషికి తార్కాణం మెదక్ జిల్లా రచయితల సంఘం తీసుకొచ్చిన "మెదక్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ సమరయోధులు" పుస్తకం. దాదాపుగా వంద మందికి సంబంధించిన రేఖా మాత్రపు సమాచారం అందించారీ గ్రంథంలో. తన సాహిత్యంతో సామాన్యులను సైతం నిజాం దుష్ట పరిపాలనను అంతమొందించడానికి కదిలించిన ప్రజాకవి ముఖ్దూం మొహ్యుద్దీన్ పోరాట విశేషాలు పాఠకుల్ని నాటి నిజాం పాలనలోని దురాగతాలు, దృశ్యాల వైపుకు మళ్ళిస్తాయి. బసవమాణయ్య గారి యుద్ధ వ్యూహాల్ని నేటికీ ఈ ప్రాంత ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటారన్న విషయాల్ని పరిశోధనాత్మకంగా అందించారు రచయిత. సమరయోధుల జీవిత విశేషాలు... స్వాతంత్ర్యోద్యమ సంఘటనలను అతిశయోక్తులు లేకుండా విషయ నివేదన చేయడం వారి నిజాయితీకి నిదర్శనం. చరిత్ర రచన ఒక పరిశోధన లాంటిది. సృజనాత్మకతకు అంతగా తావులేని ప్రక్రియ. విషయ నివేదన మాత్రమే కాక ఆయా ప్రాంతాల్లోని ప్రజల నాల్కలపై సజీవంగా నున్న చరిత్రకందని విషయాల సమాహారంగా పుస్తకాన్ని తీసుకురావడంలో రచయిత సఫలీకృతులయ్యారనే చెప్పొచ్చు. తెలుగు, ఉర్దూ, కన్నడ, మరాఠీ, పార్సీ, ఆంగ్లం వంటి పలు భాషల్లో నిష్ణాతులైన వెల్దుర్తి మాణిక్యరావు, గురువారెడ్డి, రాజకీయ చైతన్యాన్ని యువకుల్లో రగిల్చిన కొర్విపల్లి నర్సింగరావు వంటి సమరయోధుల జీవిత విశేషాల్ని, పోరాట విశేషాల్ని విషయపూర్వకంగానే కాకుండా దేశభక్తిని అంతఃసూత్రంగా చేసుకొని ఈ గ్రంథరచన చేశారు రచయిత. రాష్ట్రోద్యమానికి సంబంధించిన పలు ఉద్యమాలతో విడదీయరాని సంబంధమున్న మెదక్ జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాల్ని, పలు సంఘటనల్ని అక్షరీకరించిన విధానం పాఠకునికి మరింత ఆసక్తి గొల్పేట్లుగా ఉంది. తెలంగాణా రాజకీయాలకు కేంద్రబిందువయిన మెదక్ జిల్లా అంటేనే సహజంగానే ఆసక్తితో పాటు వివాదాలూ చుట్టుముడతాయి. అనేక చారిత్రక ఉద్యమాలకు బాసటగా నిల్చిన, అనేకులకు ఆశ్రయమిచ్చిన మెదక్ జిల్లా గురించిన చారిత్రక విషయాల్ని రచయిత ఎంతో సున్నితంగా చెప్పారు. ఈ గ్రంథాన్ని తీసుకొచ్చిన మెదక్ జిల్లా రచయితల సంఘం స్వాతంత్ర్యోద్యమంలోని అమరులైన వీరులకు అంకితమివ్వడం అభినందించదగింది. రేఖాచిత్రాలతో సహా అందంగా పాఠకులకు అందించిన రచయిత కృషి మరువలేనిది.



మెదక్ జిల్లా స్వాతంత్ర్యోద్యమము సమరయోధులు
రచన: ముబార్కపురం వీరయ్య
వెల:60/-, పేజీలు: 192,
ప్రతులకు: ఎం. వైష్ణవి, ఇం.నెం. 10-30/9, రోడ్ నెం.2, విద్యానగర్, సంగారెడ్డి క్రాస్ రోడ్స్, సంగారెడ్డి.

- సైదులు ఐనాల

టూ....మచ్!

'ఏంటిది? వీటన్నిటికీ రెండేసి తలలున్నాయి?! పొరపాటున రెండు తలల ప్రాణి ప్రపంచంలోకి వచ్చేశామా!' అనుకుంటున్నారా? అలాంటి అనుమానమేం అక్కర్లేదు. మీరు చూసే ప్రాణులన్నీ... నిక్షేపంగా ఈ భూమండలంలోవే. కాకపోతే...ఒక్కో జంతువు ఒక్కో దేశంలో జన్మించింది. వాటి గురించి తెల్సిన వాళ్లంతా మీలాగే...అనేకంటే...మీకంటే ఎక్కువగానే ఆశ్చర్యపోయారు. తండోపతండాలుగా వెళ్లి చూశారు. కొందరైతే ఫొటోలు తీసి తమ నేస్తాలు చూసేందుకు వీలుగా నెట్‌లో పెట్టేశారు. వారి పుణ్యమా అని మనక్కూడా వాటిని ఇలా చూసే భాగ్యం కలిగిందన్నమాట. అవునూ...రెండు తలలు వుంటే బావుంటుందని మీక్కూడా ఎప్పుడైనా అనిపించిందా! ఏంటి! మా ఆలోచనే టూ...మచ్‌గా వుందా?



ముందుచూపు

సాహిల్

రాబోయేది చలికాలం. అప్పుడు తొందరగా చీకటిపడిపోతుంది. చీకటిలో తిండిపదార్థాలను వెతకడం ఎంత ఇబ్బందిగా వుంటుందో. దీనికితోడు చలి వణుకు పుట్టిస్తుంటుంది. అందుకని కీటకాలన్నీ రాత్రింబగళ్లు కష్టపడి ఆహారాన్ని పోగుచేసుకుంటున్నాయి. ఒక్క మిడత తప్ప.

ఆ మిడతకు శరదృతువంటే చాలా ఇష్టం. ఎందుకంటే అప్పుడు చెట్ల ఆకులు రంగులు మారతాయి. ఎరుపు, పసుపు, నారింజ రంగు ఆకులతో కళకళలాడుతున్న చెట్లు చూడ్డానికి చాలా అందంగా వున్నాయి. పైగా చల్లటి గాలులు వీస్తున్నాయి. మిడతకు వీటన్నిటినీ ఆస్వాదిస్తూ...గిటార్ వాయించుకుంటూ పాటలు పాడుకోవడమంటే మహా ఇష్టం.

అలా ఆడుతూ...పాడుతూ... ఒక ఆకు మీద నుంచి మరో ఆకు మీదకు ఒక కొమ్మ మీద నుంచి మరో కొమ్మ మీదకు ఎగురుతూ... రోజులు గడపసాగింది మిడత. ఓసారి అలా సరదా సరదాగా ఆకులను పరిశీలిస్తూ...'యో...ఈ...జీవితం ఎంత బావుందీ. ప్రపంచం ఎంత అందంగా వుందీ...నేను ఎప్పటికీ ఇలాగే ఆడుకుంటూనే వుంటానూ...' అని పాడుకోసాగింది.

సరిగ్గా అప్పుడే అటుగా ఒక చీమ వచ్చింది. అది ఎక్కడినుంచో ఆపసోపాలు పడుతూ తినుబండారాలను మోసుకురాసాగింది. దాన్ని బాగా పరిశీలనగా చూస్తే... అది ఏ క్షణంలోనైనా ఆ బరువును మోయలేక కిందపడేసేట్టు అనిపించింది. "ఓ...ఇది చాలా బరువుగా వుంది. ఎవరైనా సాయం చేస్తే బావుండు" అనుకుంటుండగా...

చీమ పరిస్థితిని చూచి మిడత జాలి పడింది. "అబ్బో! ఎంత బరువు మోసుకొస్తున్నావ్! నీకు సాయం కావాలా!' అనడిగింది.

'అవునండి. ఒక చెయ్యి వేస్తారా! మా చీమల పుట్ట ఇక్కడికి కొద్ది దూరంలోనే వుంది. కానీ ఇదేమో బాగా బరువుగా వుంది" అంది చీమ సంతోషంగా.

దానికి మిడత కొంటెగా తలాడిస్తూ..."సరే. కాకపోతే ఒక షరతు. నువ్వు కాసేపు నాతో ఆడుకోవాలి. అప్పుడు సంతోషంగా నీకు సాయం చేస్తాను. చూడు ప్రకృతి ఎంత అందంగా వుందో! నువ్వు కూడా నాలా ఆడుకోవచ్చుకదా. ఎప్పుడూ పని చేస్తే ఎలా!' అంది.

"కాదండీ... మీరు కూడా ఆహారం సేకరించుకోవడం మొదలెట్టాలి. రాబోయేది చలికాలం కదా. లేకపోతే అప్పుడు మీకు తినడానికి ఏమీ వుండదండీ..." అంది బేలగా చీమ.

"ఏం కాదు. నేను చలికాలంలో నాకు ఆకలేసినప్పుడు ఎంచక్కా బయటకు వెళ్లి ఆహారం తెచ్చుకోగలను. ఇది మాత్రం ఆడుకోవాల్సిన సమయం. నువ్వు కొత్తగా పరిచయం అయ్యావు కాబట్టి ఇప్పుడు పార్టీ చేసుకుందాం రా.... నీకు పాటలు వినిపిస్తాను" ఆహ్వానించింది మిడత.

కానీ చీమ అందుకు ఒప్పుకోలేదు. దానికి షేక్ హ్యాండ్ ఇచ్చేసి వెళ్లిపోయింది మెల్లగా.

❊ ❊ ❊

చలికాలం రానే వచ్చింది. చలిగాలులు విపరీతంగా వున్నాయి. చీమలు పుట్టనుంచి బయటకు రావడానికి కూడా ధైర్యం చేయలేకపోతున్నాయి. కానీ అవి సంతోషంగా కడుపు నిండా తిని ఆటపాటలతో గడపసాగాయి. మరి చలికాలంలో తినడానికి ఆహారాన్ని ముందుగానే సేకరించి పెట్టుకున్నాయికదా. అవేకాదు కీటకాలన్నీ చాలా సంతోషంగా వెచ్చగా తమ తమ ఇళ్లలో వున్నాయి. ఒక్క మిడత తప్ప.

అది చలికి వణుకుతూ...ఆకలితో బాధపడుతోంది. చలి అంత తీవ్రంగా లేనప్పుడే అది ఆహారం కోసం వెళ్లింది. కానీ దానికి తినడానికి కొద్దిగానే దొరికింది. దాంతో నీరసించిపోయింది. చివరికి తన దగ్గర వున్న గిటార్ కూడా అమ్మేసి వచ్చిన డబ్బుతో రెండు రోజులకు సరిపడా ఆహారాన్ని కొనుక్కుంది. ఆ తర్వాత మళ్లీ మామూలే. ఆకలి. చలి. అప్పుడు దానికి చీమ చెప్పిన మాటలు గుర్తొచ్చి ఎంతగానో దు:ఖించింది. బతికి బాగుంటే ఇక నుంచి తను కూడా చలికాలంలో తినడానికి ఆహారాన్ని ముందుగానే పోగుచేసుకోవాలని నిర్ణయించుకుంది. ❊

(అయిపోయింది)